సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 30.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 358
పేజీలు: 08 వెల: రూ. 5

దివ్యాంగులకు కేంద్రం భరోసా!

ఐదేళ్లకు రూ.53,428 కోట్ల కేటాయింపు

- వైకల్యం 40 శాతం ఉన్నవారికీ పెన్షన్ అర్హత
- కనీస వయోపరిమితి తొలగింపు చిన్నారులకూ అవకాశం
- దేశవ్యాప్తంగా అదనంగా 19.15 లక్షల మందికి లబ్ధి

02

గ్లోబల్ ఇన్వెస్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

పెట్టుబడులే లక్ష్యంగా ఢిల్లీ పర్యటన

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం
- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్
- వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామికవేత్తలతో భేటీ..
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై వివరణ

02

మార్చినాటికి భారత్‌లో

55వేల మరణాలు

ప్రపంచాన్ని వణికిస్తున్న సూపర్ ఎల్‌నినో

- ఆరు నెలల్లో 3.73 లక్షల ప్రాణాలకు ముప్పు
- మార్చిలోనే అత్యధిక మరణాల ప్రమాదం
- ఎల్‌నినో దెబ్బకు కరవు, వడగాల్పులు బీభత్సం

02

ధరల మంటలకు

పరిష్కారం

సామాన్యుడి వంటింటికి ఉపశమనం

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల కొత్త వ్యూహాలు



ఏపీలో తక్కువ ధరకే నిత్యావసరాలు..

తెలంగాణలో సబ్సిడీ కిట్ల పంపిణీకి కసరత్తు

ధరల నియంత్రణకు కోట్లాది రూపాయల భారం

పెరుగుతున్న ధరలతో ప్రజల జేబులకు చిల్లు!

నిత్యావసరాల ధరలపై ఏపీ, తెలంగాణ ఫోకస్!

సంక్షేమ పథకాలకు ధరల పెరుగుదల సవాల్!

మార్కెట్ ధరలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వాల యత్నం!

వంటింటి బడ్జెట్టే ప్రభుత్వాలకు కీలక పరీక్ష!

ముద్ర, అమరావతి/హైదరాబాద్: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ప్రభుత్వాలకు కొత్త సవాలుగా మారుతోంది. కూరగాయలు, పప్పులు, వంటనూనెలు సహా నిత్యం వినియోగించే సరుకుల ధరలు పెరిగితే దాని ప్రభావం నేరుగా సామాన్యుడి కుటుంబ బడ్జెట్‌పై పడుతుంది. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతున్నా.. వంటింటి ఖర్చులు పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ధరల భారాన్ని తగ్గించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలపై దృష్టి సారిస్తున్నాయి. ఒకవైపు తక్కువ ధరకే నిత్యావసరాల విక్రయాలు, మరోవైపు సబ్సిడీ కిట్ల పంపిణీ ప్రతిపాదనలతో ప్రజలకు ఉపశమనం కల్పించే ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఏపీలో తక్కువ ధరకే సరుకులు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిత్యావసరాల ధరల నియంత్రణకు ప్రత్యేక విక్రయ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థను వినియోగించుకోవడంపై దృష్టి పెట్టింది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరలకు సరుకులు అందించడం ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని భావిస్తోంది. కిలో కందిపప్పు రూ.100, లీటర్ పామాయిల్ రూ.125, గోధుమ పిండి రూ.25 ధరలకు అందించే చర్యలతోపాటు, ప్రత్యేక వాహనాల ద్వారా బియ్యం పంపిణీ కూడా చేపడుతున్నట్లు సమాచారం. ఈ విక్రయాల కోసం నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అదనపు భారం పడుతున్నట్లు అంచనాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం తక్కువ ధరలకు సరుకులు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా బహిరంగ మార్కెట్ ధరలపై ఒత్తిడి తగ్గుతుందని భావిస్తోంది.

తెలంగాణలో నిత్యావసర కిట్ల యోచన

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులతో కూడిన సబ్సిడీ కిట్ల పంపిణీపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బియ్యంతోపాటు పప్పులు, వంటనూనె,

లాఠీలకు భయపడొద్దు

రామ్‌లీలా మార్చ్‌పై వెనక్కి తగ్గని రాహుల్

ఓటు చోరీపై పోరు.. ఆపేది లేదన్న రాహుల్

దీపావళి వేళ నిరసన వద్దంటున్న వ్యాపారులు రాహుల్ మాత్రం నో

రూ.10 వేల కోట్ల వ్యాపారానికి దెబ్బ?

సీఈసీని తొలగిస్తే ఆగుతాయన్న రాహుల్

ముద్ర, హైదరాబాద్ : 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబరు 1న ఇండియా కూటమి తలపెట్టిన నిరసనలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. దీపావళి పండగ నేపథ్యంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్చ్ ను వాయిదా వేసుకోవాలని స్థానిక వ్యాపార సంఘాలు అభ్యర్థిస్తున్నా.. ఆయన ర్యాలీ నిర్వహణకే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించాలనుకునే వారం తా మార్చ్‌లో పాల్గొనాలన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ఓటు చోరీని అడ్డుకునేందుకు, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు 'చలో దిల్లీ రామ్‌లీలా మార్చ్'ను నిర్వహిస్తున్నాం. ఇది ఏ రాజకీయ పార్టీకి చెందిన ర్యాలీ కాదు. నరేంద్రమోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌తో విసిగిపోయిన ప్రజలంతా ఈ నిరసన ర్యాలీలో పాల్గొనచ్చు. పోలీ సులు, లాఠీ ఛార్జీలకు భయపడొద్దు. మాతో కలిసి రండి. రాజ్యాంగాన్ని, భార త జాతిని కాపాడేందుకు మనందరం కలిసి నడుద్దాం. ఇది దేశయాత్ర.. ఇది మీ యాత్ర'' అని రాహుల్ రాసుకొచ్చారు.

దీపావళి పండగ సీజన్‌లో దిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' (CTI) పేర్కొంది. అయితే, నవంబరు 1న చేపట్టే నిరసన కారణంగా రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని సీటీఐ, వ్యాపార సంఘాలు కోరుతున్నాయి. ఈ అభ్యర్థనలపై రాహుల్ ఇప్పటికే స్పందించారు. 'మీ సమస్యలు మాకు అర్థమవుతున్నాయి. అయితే.. మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితంగా ఉండదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి'' అని కాంగ్రెస్ ఎంపీ వెల్లడించిన సంగతి తెలిసిందే.

48 ప్రతిపాదనలకు ఆమోదం

ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

ఆర్నాబ్ తుపాను బాధితులకు తక్షణ సాయం

02

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడులు..
- గ్రీన్ స్టీల్, సిలికాన్ వేఫర్ ప్లాంట్లకు గ్రీన్ సిగ్నల్
- విశాఖలో హైపర్‌స్కేల్ డేటా సెంటర్..
- ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు
- తుపాను నష్టాల నమోదు వేగవంతం..
- ప్రతి బాధితుడికీ పరిహారం అందాలి

రేషన్ బియ్యం స్కామ్

గుట్టురట్టు

రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ పేరుతో విక్రయం..

- పేదల రేషన్ బియ్యంతో మాఫియా దందా!
- కిలో రూ.100 వరకు అమ్మకం
- కర్మన్‌ఘాట్‌లో సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారుల దాడులు..
- బియ్యం నిల్వలు, ప్రాసెసింగ్ యంత్రాలు సీజ్



02

సురేఖ సారీ

కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకు క్షమాపణ

- సురేఖ క్షమాపణలపై కేటీఆర్ సెటైర్లు
- నిజం నిలకడ మీద తేలుతుంది: కేటీఆర్
- తప్పుడు ఆరోపణలు చేసినవారికి కేటీఆర్ హెచ్చరిక
- క్షమాపణలతో ముగియని రాజకీయ వివాదం

02

బ్యాంకులే పరిహారం చెల్లించాలి

సైబర్ మోసాల బాధ్యత వాటిదేనన్న సుప్రీంకోర్టు

- ఆర్‌బీఐకి కీలక ఆదేశాలు
- అనుమానాస్పద లావాదేవీలను నిలిపేయాలి
- మ్యూల్ ఖాతాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- సైబర్ మోసాల నివారణకు కఠిన నిబంధనలు తీసుకురావాలి

02



ఇదీ AI ముద్ర

ఆఫ్ఘనిస్తాన్ దాడి నేపథ్యంలో సైనికులు ఆర్మీ దుస్తులు వదిలేసి, సామాన్యుల వేషధారణలో భయంతో పారిపోతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 30 అక్టోబర్, 2026
2
జనరల్ న్యూస్
General NEWS

చిప్స్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి!

పామాయిల్‌తో తయారయ్యే చిప్స్, బిస్కట్లు, బేకరీ పదార్థాలను తరచుగా అధికంగా తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిలో కొవ్వుతో పాటు ఉప్పు, చక్కెర కూడా ఎక్కువగా ఉండవచ్చు. వీలైనంత వరకు తాజా, పోషక విలువలున్న ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

ధరల మంటకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

గోధుమపిండి, చక్కెర వంటి ఆరు రకాల సరుకులను అందించే ప్రతిపాదనపై పౌర సరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఆర్థిక ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. మరోవైపు కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించడం కూడా కీలకంగా మారనుంది.

ఖజానాపై భారం..

రెండు రాష్ట్రాలూ ఆర్థిక పరిమితులను ఎదుర్కొంటున్న సమయంలో నిత్యావసరాలపై సబ్సిడీలు, ప్రత్యేక విక్రయాల కోసం నిధులు కేటాయించడం ప్రభుత్వాలకు అదనపు భారమే. అయితే ధరల పెరుగుదల దీర్ఘకాలం కొనసాగితే ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, కుటుంబాల పొదుపులు కరిగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే సరుకుల లభ్యతను పెంచడం, నిల్వలపై నిఘా, అక్రమ నిల్వల నియంత్రణ, సబ్సిడీ విక్రయాల విస్తరణ చర్యలు అవసరమవుతున్నాయి.

ధరల నియంత్రణే అసలు పరీక్ష

నిత్యావసరాల ధరల అంశం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు.. ప్రభుత్వాల ప్రజా సంక్షేమ విధానాలకు కూడా కీలక పరీక్ష. ప్రజలకు అందించే పథకాల ప్రయోజనాలు పెరిగిన జీవన వ్యయంతో తగ్గిపోకుండా చూడటం పాలకులకు ముఖ్యమైన బాధ్యత. ఏపీలో తక్కువ ధరల విక్రయాలు, తెలంగాణలో ప్రతిపాదిత సబ్సిడీ కిట్లు ఎంతవరకు అమలవుతాయి? మార్కెట్ ధరలపై అవి ఎలాంటి ప్రభావం చూపుతాయి? ప్రభుత్వాలపై అదనపు ఆర్థిక భారం ఎంత ఉంటుంది? అన్నది కీలకం కానుంది. తాత్కాలిక ఉపశమనంతో పాటు నిరంతర సరఫరా, సమర్థమైన ధరల పర్యవేక్షణ కొనసాగితేనే సామాన్యుడి బడ్జెట్‌కు స్థిరమైన ఊరట లభిస్తుంది.

సురేఖ సారీ

ముద్ర, హైదరాబాద్ :

తనపై గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు మాజీ మంత్రి కొండా సురేఖ ప్రకటించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికరంగా స్పందించారు. నిజం నిలకడ మీద తేలుతుందని, తమపై తప్పుడు ఆరోపణలు చేసినవాళ్లు ఒక్కొక్కరుగా క్షమాపణలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. సారీ చెప్పేవాళ్లు ఇంకా చాలా మంది క్యూలో ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మొన్న పేపర్.. నేడు మేడం.. రేపు మరెందరో!

తనపై వచ్చిన ఆరోపణల విషయంలో కేటీఆర్ మరోసారి గట్టిగా స్పందించారు. కొండా సురేఖ క్షమాపణలు చెప్పిన నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. నిజం ఎప్పటికైనా బయటపడుతుందని వ్యాఖ్యానించారు. మొన్న ఒక వార్తాపత్రిక క్షమాపణలు చెప్పిందని, ఇప్పుడు కొండా సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. తమపై నిరాధారమైన ఆరోపణలు చేసినవాళ్లు భవిష్యత్తులో కూడా ఇదే విధంగా క్షమాపణలు చెప్పాల్సి వస్తుందని అన్నారు.

తమను రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశంతో అనేక ఆరోపణలు చేశారని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అయితే అవన్నీ ఒక్కొక్కటిగా దూది పింజల్లా తేలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. నిజం నిలకడ మీద తేలుతుందని పెద్దలు ఊరికే చెప్పలేదని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని పేర్కొన్నారు.

కొండా సురేఖ ట్వీట్‌పై లీగల్ టీమ్‌తో చర్చ!

కొండా సురేఖ చేసిన ట్వీట్‌ను తాను ఇంకా పూర్తిగా చూడలేదని కేటీఆర్ వెల్లడించారు. అందులో ఆమె ఏం పేర్కొన్నారో పరిశీలించిన తర్వాత తన న్యాయవాదుల బృందంతో చర్చిస్తానని చెప్పారు. ఆ తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. దీంతో కొండా సురేఖ క్షమాపణలతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడుతుందా? లేక న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

కొండా సురేఖ ట్వీట్‌లో ఏముందంటే?

అంతకుముందు కేటీఆర్‌ను ఉద్దేశించి కొండా సురేఖ సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు. గతంలో ఆయనపై చేసిన కొన్ని వ్యక్తి గత వ్యాఖ్యల విషయంలో వివరణ ఇవ్వాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు.

కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని ఆమె అంగీకరించారు. కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ వ్యక్తిగతంగా బాధపెట్టాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. వారి ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం కూడా తనకు లేదని వివరించారు. తన వ్యాఖ్యల వల్ల కేటీఆర్ లేదా ఆయన కుటుంబ సభ్యులు బాధపడి ఉంటే అందుకు చింతిస్తున్నట్లు పేర్కొన్న సురేఖ.. గతంలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు.

బ్యాంకులే పరిహారం చెల్లించాలి

ముద్ర, న్యూఢిల్లీ:

డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల ద్వారా అమాయకుల సొమ్మును దోచుకుంటున్న సైబర్ ముఠాల పట్ల అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల పర్యవేక్షణ, సరియైన తనిఖీలు (డ్యూ డిలిజెన్స్) లోపించడం వల్లే ఈ తరహా మోసాలు జరుగుతున్నాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో.. బ్యాంకింగ్ నిబంధనల వైఫల్యం వల్ల ఖాతాదారులు నష్టపోతే, వారికి సంబంధిత ఆర్థిక సంస్థలే పూర్తి స్థాయిలో పరిహారం అందించేలా నిబంధనలు రూపొందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తుది నిబంధనలు అమల్లోకి తెచ్చేందుకు నోటిఫికేషన్‌ను నవంబర్ 30, 2026 నాటికి విడుదల చేసి, డిసెంబర్ 31, 2026 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ధర్మాసనం సూచించింది.

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. దేశ ఆర్థిక వ్యవస్థపై డిజిటల్ అరెస్టుల పేరిట జరుగుతున్న దాడుల వల్ల ఈ ఏడాదే దాదాపు రూ.800 కోట్ల మేర నికర నష్టం వాటిల్లిందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ప్రతి ప్రతిపాదిత అనుమానాస్పద లావాదేవీని వెంటనే తాత్కాలికంగా నిలిపివేయడం, సంబంధిత సమాచారాన్ని స్వయంచాలకంగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపడం, అనంతరం భౌతిక తనిఖీ ద్వారా నిజానిజాలు నిర్ధారించడం వంటి ముందస్తు జాగ్రత్తలు ప్రతి ఆర్థిక సంస్థకూ నిర్బంధం చేయాలని కోర్టు పేర్కొంది. అలాగే నిబంధనలు ఉల్లంఘించే అధికారులతో పాటు మొత్తం బ్యాంకింగ్ సంస్థపైనే 'స్ట్రిక్ట్ లయబిలిటీ' మోపాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిన "మ్యూల్ ఖాతాలను" (బోగస్ అకౌంట్లను) అరికట్టడంపై ఆర్‌బీఐ ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే సైబర్ నేరాల్లో భాగస్వామ్యమున్న ఉద్యోగులపై బ్యాంకులు తీసుకున్న చర్యల వివరాలను తదుపరి విచారణ నాటికి సమర్పించాలని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణిని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ స్పందిస్తూ.. తప్పుడు ఏజెన్సీలు, అధికారుల పేరిట వచ్చే సందేశాలను గుర్తించే సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వాట్సాప్, ఇతర వేదికలకు సంబంధించి సుమారు 9,400 ఖాతాలను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (NCRP) సేవలను మరింత వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు.

దివ్యాంగులకు కేంద్రం భరోసా!

ముద్ర, న్యూఢిల్లీ :

దివ్యాంగుల సంక్షేమానికి భరోసా కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే దివ్యాంగులకు అండగా నిలవడంతో పాటు, మరింత మందికి సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలు అందించేలా నిబంధనల్లో మార్పులు చేపట్టింది. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కొనసాగింపు కోసం ఐదేళ్లపాటు రూ.53,428 కోట్ల నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలతో దేశవ్యాప్తంగా దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందే పరిధి మరింత విస్తరించనుంది.

పెన్షన్ అర్హతలో కీలక మార్పులు

దివ్యాంగులకు పెన్షన్ అందించే విషయంలో అర్హత నిబంధనలను సడలించడం ఈ నిర్ణయాల్లో ప్రధానమైనది. ఇప్పటివరకు పెన్షన్ పొందేందుకు కనీసం 80 శాతం వైకల్యం ఉండాలనే నిబంధన ఉండగా, దాన్ని 40 శాతానికి తగ్గించాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి పెన్షన్ పొందేందుకు అర్హత లభించే అవకాశం ఏర్పడుతుంది. వైకల్యం తీవ్రత ఎక్కువగా లేని కారణంగా ఇప్పటివరకు పెన్షన్‌కు దూరమైన అనేకమందికి ఈ మార్పు ప్రయోజనకరంగా మారనుంది.

చిన్నారులకూ ఆర్థిక భరోసా

దివ్యాంగుల పెన్షన్‌కు సంబంధించి కనీస వయోపరిమితిని తొలగించాలని కేంద్రం నిర్ణయించడం మరో ముఖ్యమైన అంశం. దీని వల్ల అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న దివ్యాంగ చిన్నారులకూ ఆర్థిక సహాయం పొందే అవకాశం కలుగుతుంది. చిన్న వయసులోనే వైకల్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లలకు అవసరమైన సంరక్షణ, వైద్య సేవలు, ఇతర అవసరాల కోసం కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తోడ్పడవచ్చు. అయితే పెన్షన్ మంజూరు, చెల్లింపులకు సంబంధించిన తుది అర్హతలు, అమలు విధానం ప్రభుత్వ మార్గదర్శకాలపై ఆధారపడి ఉంటాయి.

అదనంగా 19.15 లక్షల మందికి ప్రయోజనం

అర్హత నిబంధనల్లో మార్పులు, సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపుతో దేశవ్యాప్తంగా అదనంగా 19.15 లక్షల మంది ప్రయోజనం పొందనున్నట్లు అంచనా. ప్రస్తుతం వివిధ కారణాలతో సామాజిక భద్రతా పథకాలకు దూరంగా ఉన్న అర్హులైన దివ్యాంగులకు కూడా ప్రభుత్వ సహాయం అందే మార్గం సుగమం కానుంది. ఐదేళ్లపాటు రూ.53,428 కోట్ల నిధుల కేటాయింపు ద్వారా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని కేంద్రం భావిస్తోంది.

సామాజిక భద్రతకు ప్రాధాన్యం

దివ్యాంగులు ఆర్థికంగా ఇతరులపై ఆధారపడకుండా జీవించేందుకు పెన్షన్ వంటి సామాజిక భద్రతా పథకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్నవారికి, నిరంతర వైద్య సంరక్షణ అవసరమయ్యేవారికి ప్రభుత్వ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుంది. వైకల్యం శాతానికి సంబంధించిన నిబంధనలను సడలించడం, వయోపరిమితిని తొలగించడం ద్వారా మరింత మందికి సంక్షేమ ప్రయోజనాలు అందించే అవకాశం ఏర్పడుతుంది. మొత్తంగా చూస్తే, దివ్యాంగుల పెన్షన్ అర్హతను విస్తరించడం, చిన్నారులకూ అవకాశం కల్పించడం, దీర్ఘకాలిక నిధుల కేటాయింపునకు ఆమోదం తెలపడం వంటి నిర్ణయాలు దివ్యాంగుల సామాజిక భద్రతకు సంబంధించిన ముఖ్యమైన పరిణామాలు. ఈ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలైతే, అర్హులైన దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందడంతో పాటు వారి కుటుంబాలకు కూడా కొంత ఊరట లభించనుంది.

గ్లోబల్ ఇన్వెస్టర్లతో రేవంత్ భేటీ

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక అడుగు వేస్తున్నారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలకు తెలంగాణలో ఉన్న అవకాశాలను వివరించడం లక్ష్యంగా ఆయన ఢిల్లీ పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ దేశాల రాయబారులు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ ఇన్వెస్టర్లతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులు, పారిశ్రామిక అభివృద్ధికి అందుబాటులో ఉన్న అవకాశాలను వారికి వివరించనున్నారు.

గ్లోబల్ సమిట్‌కు సన్నాహాలు

తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను రాష్ట్రం వైపు ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'కు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సదస్సు ద్వారా అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలకు తెలంగాణ సామర్థ్యాన్ని పరిచయం చేయడంతోపాటు, కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ గ్లోబల్ సమిట్‌కు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సదస్సు లక్ష్యాలు, తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు. పెట్టుబడిదారుల్లో ఆసక్తిని పెంచి, గ్లోబల్ సమిట్‌కు ముందుగానే రాష్ట్రానికి అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

అంతర్జాతీయ సంస్థలకు వివరణ

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణకు ఉన్న అవకాశాలను వివరించడంపై ముఖ్యమంత్రి దృష్టి సారించనున్నారు. వివిధ దేశాల రాయబారులతో జరిగే సమావేశాలు రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతోపాటు, విదేశీ పెట్టుబడుల సమీకరణకు దోహదపడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడుల కోసం వివిధ రాష్ట్రాలు, దేశాల మధ్య పోటీ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణను ఆకర్షణీయమైన పెట్టుబడి కేంద్రంగా నిలబెట్టడం ప్రభుత్వానికి కీలకంగా మారింది. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం, తయారీ రంగం, పారిశ్రామిక అభివృద్ధి, ఆధునిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగాల కల్పనకు కీలకం

రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రావడం వల్ల పారిశ్రామిక కార్యకలాపాలు పెరగడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉంటుంది. కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న సంస్థల విస్తరణతో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక ఉద్యోగాలు సృష్టించేందుకు వీలుంటుంది. అలాగే స్థానిక వ్యాపారాలు, చిన్నతరహా పరిశ్రమలు, అనుబంధ సేవల రంగాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌ను కేవలం పెట్టుబడుల సదస్సుగా కాకుండా రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధికి ఒక వేదికగా ప్రభుత్వం ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఢిల్లీలో నిర్వహించే కర్టెన్ రైజర్ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేసుకుని, డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ సమిట్‌కు వారిని ఆకర్షించడంపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టనున్నారు. మొత్తంగా, రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన తెలంగాణకు కొత్త పెట్టుబడులను తీసుకురావాలనే ప్రభుత్వ ప్రయత్నాల్లో కీలక ఘట్టంగా నిలవనుంది. అంతర్జాతీయ సంస్థల నుంచి వచ్చే స్పందన, పెట్టుబడిదారులతో జరిగే చర్చలు, గ్లోబల్ సమిట్‌లో కుదిరే ఒప్పందాలు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఎంత వరకు దోహదం చేస్తాయన్నది చూడాలి.

రేషన్ బియ్యం స్కామ్ గుట్టురట్టు

ముద్ర, హైదరాబాద్:

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంతో కొందరు అక్రమార్కులు భారీ దందాకు తెరలేపారు. పేదల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి, యంత్రాలతో పాలిష్ చేసి, బ్రాండెడ్ కంపెనీల పేరుతో మార్కెట్లో విక్రయిస్తున్న రేషన్ బియ్యం మాఫియా గుట్టును సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ పరిసరాల్లో నిర్వహించిన తనిఖీల్లో భారీగా బియ్యం నిల్వలు, ప్రాసెసింగ్ యంత్రాలను గుర్తించి సీజ్ చేసినట్లు సమాచారం. రేషన్ లబ్ధిదారులు, డీలర్ల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరిస్తున్న దళారులు.. వాటిని రైస్ మిల్లులు, గోదాములకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అక్కడ ప్రత్యేక యంత్రాలతో బియ్యానికి పాలిష్ పట్టించి, సన్న బియ్యం మాదిరిగా మార్చి, పేరున్న బ్రాండ్ల కవర్లు లేదా నకిలీ బ్యాగుల్లో ప్యాక్ చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. అనంతరం ఈ బియ్యాన్ని కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పేదల బియ్యంతో కోట్ల దందా?

ప్రభుత్వం పేదల కోసం కేటాయిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టడం ఆహార భద్రతా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ఒకవైపు అర్హులైన లబ్ధిదారులకు అందాల్సిన బియ్యం అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్తుండగా, మరోవైపు అదే బియ్యాన్ని ప్రాసెస్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో రేషన్ డీలర్లు, దళారులు, మిల్లుల యజమానుల పాత్రపై అధికారులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.

నకిలీ బ్రాండ్లతో వినియోగదారులకు మోసం

బియ్యాన్ని పదేపదే పాలిష్ చేయడం వల్ల దాని పోషక విలువలు తగ్గే అవకాశం ఉంది. ప్రాసెసింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు ఉపయోగించినట్లు తేలితే వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడవచ్చు. బ్రాండెడ్ బియ్యమని భావించి కొనుగోలు చేసే ప్రజలు అసలు నాణ్యత తెలియక మోసపోయే ప్రమాదం ఉంది.

పీడీ యాక్ట్‌తో కట్టడికి చర్యలు

రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు, రీసైక్లింగ్ వ్యవహారాల్లో ప్రమేయం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కింద చర్యలు చేపట్టే అంశాన్ని పరిశీలించనున్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు బయోమెట్రిక్ ట్రాకింగ్, జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ వంటి చర్యలను కట్టుదిట్టం చేయాలని పౌర సరఫరాల శాఖ భావిస్తోంది. పేదల కోసం కేటాయించిన బియ్యం అక్రమార్కుల పాలవకుండా సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయడంతో పాటు, నకిలీ బ్రాండ్ల పేరుతో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్చినాటికి 55వేల మరణాలు..

ముద్ర, న్యూఢిల్లీ :

ప్రపంచంపై ఎల్‌నినో పడగవిప్పింది. దాంతో ఒకచోట కరవు, ఇంకోచోట వరదలు, తుపానుల వంటి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. పెరుగుతోన్న ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణ నిపుణులు దీనిని సూపర్ ఎల్‌నినో అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో హీట్ మోర్టాలిటీ ట్రాకర్ విడుదల చేసిన గణాంకాలు మరింత భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ అసాధారణ వాతావరణ మార్పు వల్ల సాధారణంగా వేసవిలో సంభవించే మరణాల కన్నా ప్రపంచవ్యాప్తంగా అదనంగా 3,73,000 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, రానున్న ఆరు నెలల్లో ఈ మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది.

గ్లోబల్ సౌత్ దేశాల్లో విపరీతమైన వడగాలులు, వేడి సంబంధిత మరణాలు ఎక్కువగా ఉండొచ్చని మోర్టాలిటీ ట్రాకర్ నివేదిక హెచ్చరించింది. భారత్‌పై కూడా ఎల్‌నినో ప్రభావం గట్టిగానే ఉంటుందని, అక్టోబర్ నుంచి మార్చి మధ్యలో 55వేల మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. అత్యధిక మరణాలు మార్చి నెలలోనే నమోదు కావొచ్చని వెల్లడించింది. నైజీరియాలో 56వేలు, ఇండోనేషియాలో 29వేలు, బ్రెజిల్‌లో 19వేల చొప్పున మరణాలు ఉండొచ్చని పేర్కొంది. 1950 తర్వాత ఈసారే అత్యంత బలమైన ఎల్‌నినో ఏర్పడిందని, దీని ప్రభావం 2027లోనూ కొనసాగుతుంది. 'తీవ్రమైన వేడి ప్రభావాలను ముందుగానే గుర్తించడం ఉన్నంతలో మంచి విషయం. దీనివల్ల ప్రజలకు ఎక్కువ ప్రమాదం ఎక్కడ ఉందో గుర్తించి, ప్రాణనష్టం జరగకముందే నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది'' అని ఈ ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు మైఖెల్ గ్రీన్‌స్టోన్ అభిప్రాయం వ్యక్తంచేశారు.

48 ప్రతిపాదనలకు ఆమోదం

ముద్ర, అమరావతి:

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ అత్యవసర సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, విపత్తు ఉపశమన చర్యలకు సంబంధించి ఏకంగా 48 కీలక ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. తుపాను సహాయక చర్యల్లో మంత్రులు తమ తమ జిల్లాల్లో నిమగ్నమై ఉండటంతో ఈ సమావేశాన్ని ప్రత్యేకంగా వర్చువల్ విధానంలో నిర్వహించారు. విపత్తు సమయంలో బాధితులను ఆదుకోవడంతో పాటు, రాష్ట్రంలోకి భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు, విధానపరమైన నిర్ణయాలకు ఈ భేటీలో పచ్చజెండా ఊపారు. సమావేశంలో ప్రధానంగా ఆర్నాబ్ తుపాను సృష్టించిన బీభత్సం, ప్రాథమిక నష్టం, సహాయక చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని చివరి బాధితుడికి కూడా నష్టపరిహారం సమర్థవంతంగా చేరేలా చూడాలని, ఏ ఒక్కరూ నష్టపోకూడదని సీఎం స్పష్టం చేశారు. వరదలు, ఈదురుగాలుల వల్ల నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారంతో పాటు నివాసాలు, చిన్న వ్యాపారాలు, జీవనోపాధి దెబ్బతిన్న కుటుంబాలకు పారదర్శకంగా తక్షణ ఆర్థిక సాయం అందించేలా వేగవంతమైన చర్యలు చేపట్టాలని మంత్రులను, అధికారులను ఆదేశించారు.

పరిశ్రమలు, డిజిటల్ మౌలిక వసతుల రంగానికి కేబినెట్ పెద్దపీట వేసింది. ఉత్తరాంధ్రలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు తీయించేలా విజయనగరం జిల్లాలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అంతేకాకుండా, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల్లో సెమీకండక్టర్ రంగానికి ఊతమిచ్చేలా 91.10 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సిలికాన్ వేఫర్ తయారీ కేంద్రం స్థాపనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు విశాఖపట్నాన్ని గ్లోబల్ ఐటీ డిజిటల్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రతిష్టాత్మక హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ప్రాజెక్టుకు అవసరమైన భూకేటాయింపుల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ భేటీ సందర్భంగా మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రీ-ప్లాంటేషన్, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీరు, పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల వేళ ప్రజలకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నిలవాలి. యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉండి సాధారణ పరిస్థితులు తెచ్చే వరకు పర్యవేక్షించాలి అని ఆదేశించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 30.10.2026
www.mudranews.in | @mudranews

గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి!

పామాయిల్‌ను అధికంగా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రభావితమవుతాయి. అయితే గుండె జబ్బులకు పామాయిల్ ఒక్కటే కారణం కాదు. ధూమపానం, వ్యాయామం లేకపోవడం, అధిక బరువు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కూడా గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

దీపావళి కానుక పేరుతో రూ.8 వేల సైబర్ మోసం

నకిలీ వాట్సాప్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

ముద్ర, హైదరాబాద్: దీపావళి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారత పౌరులందరికీ రూ.8,000 నగదు ప్రయోజనం అంది స్తోందంటూ వాట్సాప్ లో ప్రచారమ వుతున్న సందే శం పూర్తిగా నకిలీదని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ప్రధానమంత్రి పేరును ఉపయోగించి ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి సందేశాల్లోని అనుమానాస్పద లింక్ లను క్లిక్ చేయవద్దని సూచించింది. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని, పండుగల సమయంలో ఉండే ఆసక్తిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలను సేకరిస్తున్నారని తెలిపింది. ఓటీపీ, యూపీఐ పిన్, పాస్ వర్డ్ లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేసింది. ప్రభుత్వ పథకాలపై వచ్చే సమాచారాన్ని అధికారిక వెబ్ సైట్ లు, ధృవీకరించిన ప్రకటనల ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలని సూచించింది. ఇప్పటికే అనుమానాస్పద లింక్ పై క్లిక్ చేసినవారు ఎలాంటి వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయవద్దని, అనధికారిక ఆర్థిక లావాదేవీలు జరిగినట్లయితే వెంటనే బ్యాంకును సంప్రదించాలని పేర్కొంది. సైబర్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్ సైట్ లో ఫిర్యాదు చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ సూచించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు "ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి" అనే సూత్రాన్ని పాటించాలని, నకిలీ సందేశాలను ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సీపీఎం నేత సామినేని రామారావు హత్య కేసు ఛేదన

- విలేకరుల సమావేశంలో సీపీ సునీల్ దత్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం : గత ఏడాది అక్టోబర్ 31న ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో వాకింగ్ కు వెళ్తున్న సిపిఎం పార్టీ రైతు సంఘం సీనియర్ నేత సామినేని రామారావు (72) దారుణ హత్యకు గురైన సంఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇంటి పక్కన ఉన్న షెడ్ వద్ద జరిగిన ఈ కేసు పురోగతికి సంబంధించిన వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కేసు దర్యాప్తుకు ఏసీపీ సారంగపాణి నేతృత్వంలో సీసీఎస్, టాస్క్ ఫోర్స్ ఇతర విభాగాలకు చెందిన అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులతో 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఘటన జరిగిన స్థలంలో దొరికిన కాలు పాదాల ఆనవాళ్లు, క్లాత్ పీస్ ఆధారంగా టెక్నికల్, ఫిజికల్ పద్ధతుల్లో లోతుగా విచారణ చేపట్టారు. ఈ కేసు మొదటి నుంచి ఎంతో సంక్లిష్టంగా మారడంతో సవాళ్లను అధిగమించి నిందితులను గుర్తించినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా పాతర్లపాడు గ్రామానికి చెందిన 24 మందికి పాలిగ్రాఫ్ (లై డిటెక్టర్) పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతి తీసుకోగా, వారిలో 6 మంది పరీక్షలకు అంగీకరించారు. గుజరాత్ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ విశ్లేషణ బృందం ద్వారా ఈ ఆరుగురికి పరీక్షలు నిర్వహించగా, కేసులో వారికి ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టమైంది. భవిష్యత్తులో కూడా దర్యాప్తుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

టెక్నికల్ ఆధారాలు, లొకేషన్ వివరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నట్లు సీపీ తెలిపారు. దర్యాప్తులో ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన బోధపట్ల శ్రీనివాసరావు (అలియాస్ మెంటల్ శ్రీను), నూకాల లింగయ్య , కర్లపూడి ఉదయ్ కుమార్, మల్లారపు లక్ష్మయ్య నేరం జరిగిన స్థలంతో నేరుగా సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వీరిపై గతంలో మర్డర్, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరాల క్రిమినల్ రికార్డు ఉంది. నిందితుల నుంచి రెండు కత్తులు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాత రాజకీయ, ఆర్థిక విభేదాల కారణంగానే ఈ హత్య జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ అధికారులు వెంకటప్రసాద్, వీరేందర్, రమాదేవి, దర్యాప్తు బృందాలను సీపీ సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించారు.

ఉస్మానియా యూనివర్సిటీలో 'స్టాండ్ విత్ హర్' శిక్షణ

ముద్ర, హైదరాబాద్: మహిళల భద్రత, సమానత్వం, పరస్పర గౌరవం, సమ్మతిపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో రెండు రోజుల '#StandWithHer' శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. అక్టోబర్ 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి డీజీ చారు సిన్హా, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం హాజరయ్యారు. మహిళల భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చారు సిన్హా పేర్కొన్నారు. యువత హానికరమైన మూసధోరణులను ప్రశ్నిస్తూ, వేధింపులు, వివక్షకు వ్యతిరేకంగా స్పందించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించడం అవసరమని వీసీ తెలిపారు. ఈ శిక్షణలో లింగ సమానత్వం, వ్యక్తిగత హద్దులు, సమ్మతి, సానుభూతితో వ్యవహరించడం, గౌరవప్రదమైన సంభాషణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. నాలుగు బ్యాచ్‌లుగా 250 మందికి పైగా శిక్షణ పొందనుండగా, వీరి ద్వారా రాబోయే ఆరు నెలల్లో 2,000 మందికి పైగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వేధింపులను ప్రశ్నించండి.. వివక్షను ఎదిరించండి

- మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
- 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో డిజి చారు సిన్హా

ముద్ర, హైదరాబాద్ : మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా పేర్కొన్నారు. వేధింపులు, వివక్ష వంటి అనుచిత ప్రవర్తనను గుర్తించి ప్రశ్నించే ధైర్యాన్ని యువత అలవరచుకోవాలని సూచించారు. తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గురువారం 'స్టాండ్ విత్ హర్' ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ కుమార్ మొలుగారం, డిజి చారు సిన్హా, మహిళా భద్రతా విభాగం శిక్షణ, కంటెంట్ అభివృద్ధి విభాగం అధిపతి ఆసియా షెర్వాణి హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పు రావాలి

మహిళల భద్రతకు చట్టాల అమలు ఒక్కటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానం, సామాజిక దృక్పథం, రోజువారీ

ప్రవర్తనలోనూ మార్పు రావాలని డిజి పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలని, లింగ వివక్ష, వేధింపులను ప్రోత్సహించే ధోరణులను వ్యతిరేకించాలని సూచించారు. పరస్పర గౌరవం, సమ్మతి, వ్యక్తిగత హద్దులు, సమానత్వంపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు.

మహిళలకు సురక్షిత వాతావరణం

విశ్వవిద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ సురక్షితమైన విద్యా వాతావరణాన్ని ఏర్పరచాల్సిన అవసరం ఉందని ఉపకులపతి కుమార్ మొలుగారం అన్నారు. విశ్వవిద్యాలయంలో సుమారు 40 శాతం మంది అధ్యాపకులు మహిళలేనని తెలిపారు. 1,500 మంది మహిళలు నివసించేలా ప్రత్యేక బహుళ అంతస్తుల వసతి గృహాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

ఆరు నెలల్లో 2,000 మందికి అవగాహన

ఈ నెల 30వ తేదీ వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో నాలుగు బ్యాచ్‌లుగా 250 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ ఇస్తారు. వీరు తమ కళాశాలల్లో ఇతరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా వచ్చే ఆరు నెలల్లో 2,000 మందికి పైగా ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

శిక్షణలో చురుగ్గా వినడం, ఇతరుల భావాలను అర్థం చేసుకోవడం, సమర్థంగా మాట్లాడటం, క్లిష్టమైన అంశాలపై చర్చలను నిర్వహించడం వంటి నైపుణ్యాలను నేర్పిస్తారు. వీటి ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే సామర్థ్యం, సమస్యలను విశ్లేషించే నైపుణ్యాలు పెంపొందుతాయి. మహిళల భద్రత, గౌరవం, సమానత్వం, పరస్పర సమ్మతిపై అవగాహనను కార్యాచరణగా మార్చి, సురక్షితమైన సమాజ నిర్మాణానికి కృషి చేయడమే 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం లక్ష్యంగా డిజి పేర్కొన్నారు.

పోలీసు సేవలను ప్రజలకు చేరవేయడమే 'సురక్ష' లక్ష్యం

ముద్ర, హైదరాబాద్ : పోలీసు శాఖ సేవలు, త్యాగాలు, ప్రజా భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే 'సురక్ష' దినపత్రిక ప్రధాన లక్ష్యమని తెలంగాణ డీజీపీ, పత్రిక ప్రధాన సంపాదకుడు సి.వి. ఆనంద్ అన్నారు. హైదరాబాద్‌లోని పేట్లబురుజు సిటీ పోలీస్ కాలేజీలో గురువారం నిర్వహించిన 'సురక్ష' ప్రథమ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సాంకేతికత అభివృద్ధితో సమాచార ప్రసారం వేగవంతమైందని, అయితే తప్పుడు వార్తలను అరికట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం కీలకమని పేర్కొన్నారు. పోలీసుల విధి నిర్వహణలోని సవాళ్లు, అమరవీరుల సేవలు, నేరాల నివారణ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనాలు ప్రచురించాలని సూచించారు. పోలీసు శాఖలో చేపడుతున్న సంస్కరణలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. స్థానిక భాష, ప్రాంతీయ యాసలపై పట్టు ఉంటేనే ప్రజల సమస్యలను మెరుగ్గా అర్థం చేసుకోగలమని, పోలీసులకు ప్రజలకు మధ్య 'సురక్ష' సమాచార వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్, కార్యనిర్వాహక సంపాదకుడు రమేష్, ప్రముఖ పాత్రికేయులు, వివిధ జిల్లాల పోలీసు పీఆర్వోలు పాల్గొన్నారు.

రైల్వేలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం

ముద్ర, సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం–2026 నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ భవన్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి "సమృద్ధి కోసం నిజాయితీ" ప్రధాన ఇతివృత్తంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆశిష్ మెహ్రోత్రా, హైదరాబాద్ డివిజన్ డీఆర్‌ఎం సంతోష్ కుమార్ వర్మ హాజరయ్యారు. ప్రభుత్వ సేవల్లో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం కీలకమని, అవినీతిపై రాజీలేని వైఖరిని అవలంబించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ విభాగాల్లో అవినీతి నిరోధక చర్యలపై కేస్ స్టడీలను ప్రదర్శించడంతో పాటు, విజిలెన్స్ అవగాహన నాటికను ప్రదర్శించారు. అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు ఈ వారోత్సవాలు కొనసాగనున్నాయి.

అర్నబ్ తుఫాన్ బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా

ముద్ర, కోనసీమ జిల్లా: అర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం పర్యటించారు. ఏరియల్ వ్యూ ద్వారా పరిస్థితులను పరిశీలించిన అనంతరం కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలంలో చెయ్యేరు, వేట్ల పాలెం, గచ్చకాయలపొర గ్రామాలను సందర్శించారు. తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం పునరావాస కేంద్రాల్లోని బాధితులను పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను సమీక్షించారు.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం

- ఐటీ, ఫార్మా, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

ముద్ర, తెలంగాణ బ్యూరో: తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ నాయకత్వ స్థానంలో ఉందని, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం విశేష ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పారిశ్రామికవేత్తలు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, హైదరాబాద్ వివిధ రంగాల్లో సాధించిన విజయాలు, పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై కార్యక్రమంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా ప్రసంగించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శ్రీధర్‌బాబు వివరించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని

ప్రారంభించారని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పారిశ్రామికవేత్తలకు అవకాశాలను కల్పిస్తున్నాయని వివరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరై, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.

తెలంగాణ విజయగాథలో కేంద్రం భాగస్వామి

- పీయూష్ గోయల్
- వికసిత్ భారత్ లక్ష్యానికి అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలి

ముద్ర, హైదరాబాద్: 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని రంగాలు తమ సత్తా చాటాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ పిలుపునిచ్చారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకోవడాన్ని స్వాగతించారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దసరా, కర్వా చౌత్, దీపావళి పండుగల సందడి నెలకొందని, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి వేదికగా నిలిచే ఈ సమ్మిట్ మరో పండుగ వంటిదని పేర్కొన్నారు. సుమారు 700 ఏళ్ల క్రితమే కాకతీయ గణపతి దేవుడు మోటుపల్లి శాసనం ద్వారా నౌకా వాణిజ్యానికి ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. అప్పట్లో వ్యాపారులు కోరుకున్న పెట్టుబడుల భద్రత, విధానాల్లో స్థిరత్వం నేటి పారిశ్రామికవేత్తలకు కూడా అవసరమని చెప్పారు.

ప్రపంచంలోని అగ్ర ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని, అంచనాలకు మించి వేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని పీయూష్ గోయల్ అన్నారు. అంతర్జాతీయ సంక్షోభాలు, సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ఎగుమతుల్లో పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. జీసీసీ, కృత్రిమ మేధ (ఏఐ), లైఫ్ సైన్సెస్

రంగాల్లో హైదరాబాద్ ముందంజలో ఉందని పేర్కొన్నారు.

జీఐ గుర్తింపు పొందిన తాండూరు కందులు, నిజామాబాద్ పసుపు వంటి తెలంగాణ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ఫార్మా, బయోటెక్నాలజీతో పాటు ఏరోస్పేస్, రక్షణ రంగం, క్వాంటం కంప్యూటింగ్‌పై తెలంగాణ మరింత దృష్టి సారించాలని సూచించారు. సులభతర వాణిజ్య విధానాలను మెరుగుపరచడం ద్వారా పెట్టుబడులను, ఉద్యోగ అవకాశాలను పెంచుకోవచ్చని తెలిపారు. తెలంగాణలో వచ్చే ప్రతి పెట్టుబడి, సృష్టించే ప్రతి ఉద్యోగం రాష్ట్ర అభివృద్ధితో పాటు వికసిత్ భారత్ లక్ష్యానికి దోహదపడుతుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

శుక్రవారం,
30 అక్టోబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com

హానికరమైన కొవ్వులు తగ్గించండి

మీరు తీసుకునే మొత్తం శక్తిలో కొవ్వుల వాటా 30% కంటే తక్కువగా ఉండాలి. ఇది అనారోగ్యకరమైన బరువు పెరుగుదలను, అంటువ్యాధులు కాని వ్యాధులను (NCDs) నివారించడంలో సహాయపడుతుంది. కొవ్వులలో వివిధ రకాలున్నాయి, కానీ సంతృప్త కొవ్వులు, ట్రాన్స్-ఫ్యాట్‌ల కంటే అసంతృప్త కొవ్వులు శ్రేష్ఠమైనవి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) సిఫార్సుల ప్రకారం, సంతృప్త కొవ్వులను మొత్తం శక్తిలో 10% కంటే తక్కువకు తగ్గించాలి; ట్రాన్స్-ఫ్యాట్‌లను మొత్తం శక్తిలో 1% కంటే తక్కువకు తగ్గించాలి; సంతృప్త కొవ్వులు, ట్రాన్స్-ఫ్యాట్‌లు రెండింటి స్థానంలో అసంతృప్త కొవ్వులను తీసుకోవాలి. శ్రేష్ఠమైన అసంతృప్త కొవ్వులు చేపలు, అవకాడో మరియు నట్స్‌లో, ఇంకా పొద్దుతిరుగుడు, సోయాబీన్, కెనోలా మరియు ఆలివ్ నూనెలలో లభిస్తాయి; సంతృప్త కొవ్వులు కొవ్వు మాంసం, వెన్న, పామ్ మరియు కొబ్బరి నూనె, క్రీమ్, చీజ్, నెయ్యి మరియు పందికొవ్వులో లభిస్తాయి; మరియు ట్రాన్స్-ఫ్యాట్‌లు బేక్ చేసిన మరియు వేయించిన ఆహారాలలో, ఇంకా ఫ్రోజెన్ పిజ్జా, కుకీలు, బిస్కెట్లు, మరియు వంట నూనెలు మరియు స్ప్రెడ్‌ల వంటి ముందుగా ప్యాక్ చేసిన స్నాక్స్ మరియు ఆహారాలలో లభిస్తాయి.

హార్ట్‌కు చేపలు బెటర్!

వారానికి ఎన్నిసార్లు తినాలో తెలుసా?

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రోజు వారీ ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవడంతో పాటు, వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం కూడా ముఖ్యం. ముఖ్యంగా చేపలను ఆహారంలో చేర్చుకోవడం గుండె ఆరోగ్యానికి మేలు చేయవచ్చు. చేపల్లో లభించే ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలోని ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే, అన్ని చేపల్లో పోషకాల పరిమాణం ఒకే లా ఉండదు.

సాల్మన్ చేపతో గుండెకు ప్రయోజనాలు

సాల్మన్ చేపలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు, ముఖ్యంగా EPA, DHA సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తంలోని ట్రైగ్లిజరైడ్లను తగ్గించడంలో సహాయపడతాయి. సమతుల్య ఆహారంలో భాగంగా సాల్మన్ చేపను తీసుకోవడం గుండె ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ చేపలో ప్రొటీన్ కూడా అధికంగా ఉండడంతో కండరాల నిర్మాణకు తోడ్పడుతుంది. సాల్మన్ అందుబాటులో లేని వారు స్థానికంగా లభించే పోషక విలువలున్న చేపలను ఎంచుకోవచ్చు.

బాంగ్డా (మాకెరెల్) చేప మంచిది?

బాంగ్డా లేదా మాకెరెల్ చేపలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్ వంటి పోషకాలు లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడతాయి. అయితే, మాకెరెల్‌లోని పాదరసం స్థాయిలు దాని జాతిని బట్టి మారవచ్చు. అందువల్ల తక్కువ పాదరసం కలిగిన రకాలను ఎంచుకోవడం మంచిది. చేపను అధిక నూనెలో వేయించకుండా, తక్కువ నూనెతో ఉడికించడం లేదా గ్రిల్ చేయడం ఆరోగ్యకరమైన ఎంపిక.

సార్డిన్ చేపలో పోషకాలు పుష్కలం

సార్డిన్ చిన్న పరిమాణంలో ఉండే కొవ్వు చేప. ఇందులో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్, విటమిన్ బి12 వంటి పోషకాలు ఉంటాయి. ఎముకలతో సహా తినే సార్డిన్‌లో కాల్షియం కూడా లభించవచ్చు. పోషకాలు సమతుల్య ఆహారానికి తోడ్పడతాయి. సార్డిన్‌ను కూరగా, ఆవిరిపై ఉడికించి లేదా తక్కువ నూనెతో వండుకుని తీసుకోవచ్చు.

వారానికి ఎన్నిసార్లు చేపలు తినాలి?

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ గుండె ఆరోగ్యం కోసం వారానికి రెండు సార్లు చేపలు తినాలని సిఫార్సు చేస్తోంది. ఒక వడ్డనకు సుమారు 85 గ్రాముల వండిన చేపలను సూచనాత్మక పరిమాణంగా పరిగణించవచ్చు. చేపలతో పాటు ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి పోషకమైన ఆహారాలను కూడా తీసుకోవాలి.

చేపలు వండే విధానం కూడా ముఖ్యం

చేపలను అధిక నూనెలో వేయించడం వల్ల ఆహారంలో కొవ్వు, కేలరీలు పెరగవచ్చు. అందువల్ల ఆవిరిపై ఉడికించడం, గ్రిల్ చేయడం, బేక్ చేయడం లేదా తక్కువ నూనెతో కూరగా వండుకోవడం మంచిది. ఉప్పును పరిమితంగా వాడటం కూడా గుండె ఆరోగ్యానికి ఉపయోగకరం. చేపలను కొనుగోలు చేసేటప్పుడు వాటి తాజాదనం, పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి.

చేపలు తింటే గుండెపోటు రాదా?

చేపలను తినడం వల్ల గుండెపోటు ప్రమాదం పూర్తిగా తొలగిపోదు. గుండె ఆరోగ్యం అనేది రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, పొగతాగడం, శారీరక చురుకుదనం, కుటుంబ చరిత్ర వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి చేపలను మాత్రమే నమ్ముకోకుండా, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన బరువు, వైద్య పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

మొత్తంగా చెప్పాలంటే: సాల్మన్, సార్డిన్, తక్కువ పాదరసం కలిగిన మాకెరెల్ వంటి చేపలను వారానికి రెండుసార్లు సమతుల్య ఆహారంలో చేర్చుకోవడం గుండె ఆరోగ్యానికి మేలు చేయవచ్చు. అయితే, చేపల ఎంపిక, వండే విధానం, మొత్తం జీవనశైలి కూడా అంతే ముఖ్యం. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా ప్రత్యేక ఆహార నియమాలు పాటిస్తున్నవారు తమ వైద్యుడి సలహా తీసుకోవాలి.

జగతికి శాంతిని పంచిన మానవతా శిఖరం

అక్టోబర్ 30 హెన్రీ డ్యునాంట్ వర్ధంతి

ప్రపంచవ్యాప్తంగా నిస్వార్థ సేవకు, మానవతా దృక్పథానికి నిలువెత్తు రూపమైన 'రెడ్‌క్రాస్' సంస్థను స్థాపించిన మహోన్నత వ్యక్తి జీన్ హెన్రీ డ్యునాంట్. ప్రతి సంవత్సరం మే 8న ఆయన జయంతిని 'ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం'గా జరుపుకుంటూ ఉండగా, ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహామానవుడు మానవాళికి అందించిన సేవలను, ఆయన ఆశయాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి విధి. యుద్ధ రంగంలో క్షతగాత్రులైన శత్రువులని కూడా చూడకుండా మానవతా దృక్పథంతో సేవలు అందించవచ్చని నిరూపించిన హెన్రీ డ్యునాంట్ జీవితం, నేటి హింసాపూరిత ప్రపంచంలో శాంతి మరియు కారుణ్య సందేశాన్ని చాటడంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

సుధాకర్ ఏవీ
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు,
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్
(STUTS), 9000674747

స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జన్మించిన హెన్రీ డ్యునాంట్ యువకుడిగా ఉన్న సమయంలో వ్యాపార నిమిత్తం ఇటలీకి వెళ్లారు. అదే సమయంలో, 1859 జూన్ 24న జరిగిన చారిత్రాత్మక 'సాల్ఫరినో యుద్ధం' ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆ యుద్ధభూమిలో వేలాది మంది సైనికులు తీవ్ర గాయాలతో, ఎలాంటి వైద్య సహాయం అందక అల్లాడిపోవడాన్ని ఆయన స్వయంగా చూశారు. చుట్టూ మృత్యువు తాండవిస్తున్న ఆ భయానక వాతావరణంలో, డ్యునాంట్ చలించిపోయారు. స్థానిక ప్రజలను సమీకరించి, కుల, మత, దేశాల భేదాలు చూడకుండా ఇరువర్గాల క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స మరియు ఆహారం అందించి మానవత్వానికి సరికొత్త నిర్వచనం చెప్పారు.

యుద్ధభూమిలో తాను చూసిన ఆ అణచివేత, క్షతగాత్రుల నొప్పులు డ్యునాంట్ మనసుపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆ అనుభవాల ఆధారంగా ఆయన 'ఎ మెమొరీ ఆఫ్ సాల్ఫరినో' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకంలో ప్రతి దేశంలోనూ యుద్ధ సమయాల్లో క్షతగాత్రులకు సేవ చేయడానికి స్వచ్ఛంద సేవకులతో కూడిన ఒక శాశ్వత సంస్థను ఏర్పాటు చేయాలని, అలాగే గాయపడిన సైనికులకు రక్షణ కల్పించడానికి అంతర్జాతీయ చట్టాలు ఉండాలని ప్రతిపాదించారు. ఆయన ఆలోచన యూరప్ అంతటా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగానే 1863లో 'ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ది రెడ్‌క్రాస్' ఏర్పాటైంది. యుద్ధ బాధితులకు తటస్థంగా సేవలు అందించే ఈ సంస్థ, తదనంతరం ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధులు సోకినప్పుడు సహాయం అందించే మానవతా సంస్థగా రూపాంతరం చెందింది.

హెన్రీ డ్యునాంట్ తన జీవితాన్ని, సర్వస్వాన్ని మానవతా సేవలకే అంకితం చేశారు. రెడ్‌క్రాస్ స్థాపన కోసం తన ఆస్తులన్నీ ఖర్చు పెట్టడంతో ఆయన చివరి రోజుల్లో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు, ఒంటరి జీవితాన్ని గడిపారు. అయినప్పటికీ ఆయన సేవాభావం ఎన్నటికీ తగ్గలేదు. ఆయన మానవాళికి అందించిన ఈ నిస్వార్థ సేవలను గుర్తించిన నార్వేజియన్ నోబెల్ కమిటీ, 1901 సంవత్సరంలో మొట్టమొదటి నోబెల్ శాంతి బహుమతిని హెన్రీ డ్యునాంట్‌కు ప్రదానం చేసింది. ప్రపంచ శాంతికి మరియు మానవ హక్కుల పరిరక్షణకు పునాది వేసిన ఆయన సేవలకు లభించిన అత్యున్నత గౌరవం ఇది.

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి ప్రాణదానం చేసే 'రెడ్‌క్రాస్' సంస్థ స్థాపకుడు, అంతర్జాతీయ మానవతావాది జీన్ హెన్రీ డ్యూనెంట్ 1910, అక్టోబర్ 30న స్విట్జర్లాండ్‌లోని 'హైడెన్'పట్టణంలో తన 82వ ఏట తుదిశ్వాస విడిచారు. మానవాళికి అత్యున్నత సేవలు అందించిన ఈ మహనీయుడి జీవితం ఎంతటి ఘనమైనదో, ఆయన చివరి రోజులు అంతటి ఏకాంతంతో, విరామంతో సాగాయి.

హెన్రీ డ్యునాంట్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయనో గొప్ప ఉద్యమం, కారుణ్యానికి నిలువెత్తు నిదర్శనం. నేటి ఆధునిక ప్రపంచంలో యుద్ధాలు, హింస, ప్రకృతి వైపరీత్యాలు మానవాళిని భయపెడుతున్న తరుణంలో హెన్రీ డ్యునాంట్ ఆశయాలు మరింత ప్రస్ఫుటంగా అవసరమవుతున్నాయి. ఆయన వర్ధంతి సందర్భంగా కుల, మత, ప్రాంతీయ భేదాలను విడనాడి తోటి మనుషుల పట్ల ప్రేమ, కరుణను చూపడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి. డ్యునాంట్ చూపిన మానవతా మార్గంలో పయనిస్తూ, హింసను రూపుమాపి శాంతియుత సమాజాన్ని నిర్మించడమే మన అందరి కర్తవ్యం.

నిద్ర బలంపై ప్రభావం చూపుతుందా?



రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం లేదా పని ఒత్తిడితో నిద్రను తగ్గించుకోవడం చాలామందికి అలవాటుగా మారింది. అయితే, ఈ అలవాట్లు ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ లక్ష్యాలపైనా ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నా, సరైన ఆహారం తీసుకుంటున్నా తగినంత నిద్ర లేకపోతే ఆశించిన ఫలితాలు పొందడం కష్టమవుతుంది. ముఖ్యంగా కండరాల పెరుగుదల, శారీరక బలం, వ్యాయామ సామర్థ్యం, శరీరం కోలుకునే ప్రక్రియపై నిద్ర కీలక పాత్ర పోషిస్తుంది.

వ్యాయామ సామర్థ్యంపై ప్రభావం

క్రేవెన్, అతని సహచరులు నిర్వహించిన ఆకస్మిక నిద్రలేమి, శారీరక పనితీరుపై ప్రభావాలకు సంబంధించిన క్రమబద్ధమైన సమీక్ష, మెటా–విశ్లేషణ ప్రకారం, నిద్ర తగ్గడం వల్ల వ్యాయామ సామర్థ్యం దెబ్బతినే అవకాశం ఉంది. ఒకటి లేదా రెండు రాత్రులు తగినంత నిద్రపోకపోయినా బలం, వేగం, ఏకాగ్రత, ఓర్పు వంటి అంశాల్లో మార్పులు కనిపించవచ్చు. దీంతో గతంలో సులభంగా చేసిన వ్యాయామాలు కూడా ఎక్కువ శ్రమతో కూడుకున్నవిగా అనిపించవచ్చు.

నిద్ర తగ్గినప్పుడు ప్రతిచర్య వేగం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కూడా మందగించవచ్చు. ఫలితంగా బరువులు ఎత్తేటప్పుడు సరైన భంగిమను కొనసాగించడం, క్రీడల్లో వేగంగా స్పందించడం కష్టమవుతుంది. అలసట కారణంగా వ్యాయామ సమయంలో తప్పులు జరిగే ప్రమాదం కూడా పెరుగుతుంది. అయితే, ప్రతి వ్యక్తిలో ఈ ప్రభావాలు ఒకే స్థాయిలో ఉండవు.

కండరాల మరమ్మతుకు నిద్ర అవసరం

వ్యాయామం చేసినప్పుడు కండరాలపై ఒత్తిడి పెరుగుతుంది. వాటి మరమ్మత్తు, పునరుద్ధరణకు తగిన విశ్రాంతి అవసరం. నిద్ర సమయంలో శరీరంలోని పునరుద్ధరణ ప్రక్రియలు కొనసాగుతాయి. నిద్ర నిరంతరం తగ్గిపోతే కండరాల నొప్పులు తగ్గడానికి ఎక్కువ సమయం పట్టవచ్చు. శిక్షణ తర్వాత శరీరం పూర్తిగా కోలుకోకపోవడం వల్ల తదుపరి వ్యాయామ సెషన్లలో పనితీరు తగ్గే అవకాశం ఉంటుంది.

ఆకలి, జీవక్రియపైనా ప్రభావం

నిద్రకు ఆకలిని నియంత్రించే లెప్టిన్, గ్రెలిన్ వంటి హార్మోన్లతో సంబంధం ఉంది. తగినంత నిద్ర లేకపోవడం ఆకలి, ఆహార ఎంపికలు, శక్తి వినియోగాన్ని ప్రభావితం చేయవచ్చు. దీంతో అధిక కేలరీల ఆహారం తినాలనే కోరిక పెరగడం, బరువు నియంత్రణ లక్ష్యాలను పాటించడం కష్టమవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే, జీవక్రియలో మార్పులు వ్యక్తిగత పరిస్థితులు, ఆహారం, శారీరక చురుకుదనం వంటి అంశాలపై కూడా ఆధారపడి ఉంటాయి.

ఫిట్‌నెస్‌లో స్థిరత్వం ముఖ్యం

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రచురించిన పరిశోధనలో, 12 నెలల ఆరోగ్య కార్యక్రమంలో పాల్గొన్న 125 మందిని పరిశీలించారు. మెరుగైన నిద్ర అలవాట్లు ఉన్నవారు వ్యాయామ ప్రణాళికను అనుసరించడం, నిర్ణీత సెషన్లకు హాజరవడం, కేలరీల లక్ష్యాలను పాటించడం వంటి అంశాల్లో మెరుగైన స్థిరత్వం చూపినట్లు నివేదించారు. ఈ ఫలితాలు నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి మధ్య ఉన్న సంబంధాన్ని సూచిస్తున్నాయి.

రోజుకు ఎన్ని గంటలు నిద్రపోవాలి?

పెద్ద ఒక్కరూ సాధారణంగా రాత్రిపూట కనీసం 7 గంటలు నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, నిద్రకు ముందు కెఫీన్‌ను పరిమితం చేయడం, పడుకునే ముందు స్క్రీన్ వినియోగాన్ని తగ్గించడం వంటి అలవాట్లు ఉపయోగపడతాయి. నిద్ర తక్కువగా ఉన్న రోజుల్లో తీవ్రమైన వ్యాయామం చేయకుండా, శరీర పరిస్థితిని బట్టి తేలికపాటి వ్యాయామం లేదా విశ్రాంతి ఎంచుకోవాలి.

మొత్తంగా చూస్తే, ఒక్క రాత్రి నిద్ర సరిగా లేకపోవడం వల్ల నెలల తరబడి చేసిన శిక్షణ మొత్తం వృథా అయిపోదు. అయితే, నిద్రలేమి నిరంతర అలవాటుగా మారితే ఫిట్‌నెస్ పురోగతి, ఆరోగ్యం రెండింటిపైనా ప్రతికూల ప్రభావాలు పడవచ్చు. కాబట్టి వ్యాయామం, పోషకాహారంతో పాటు నిద్రకూ సమాన ప్రాధాన్యం ఇవ్వడం ఆరోగ్యకరమైన జీవనశైలికి కీలకం.

రాగి బన్ దోశ

ఈ పిండితో అప్పటికప్పుడు దోసలుగా తయారుచేయడం ఎలాగో తెలుసుకోండి. బొంబాయి రవ్వ, పెరుగుతో కలిపి చేసే ఈ దోసలు రుచికరంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఎప్పుడైనా మీ ఇంటికి అతిథులు వచ్చినప్పుడు.. పిల్లల అల్పాహారం కోసం కేవలం పది నిమిషాల్లో ఈ మెత్తని, పొంగిన బన్ దోసలను రెడీ చేయవచ్చు..

తయారీకి కావాల్సిన పదార్థాలు: రాగి పిండి – 1 కప్పు, బొంబాయి రవ్వ (ఉప్మా రవ్వ) – ½ కప్పు, పెరుగు – 1 కప్పు, నీరు – ½ కప్పు ఉల్లిపాయ – 1 (చిన్నగా తరిగినది), టమాటో – 1 పెద్దది లేదా 2 చిన్నవి (చిన్నగా తరిగినవి), పచ్చిమిర్చి – రుచికి సరిపడా (చిన్నగా తరిగినవి), కొత్తిమీర తరుగు – కొద్దిగా, కరివేపాకు – కొద్దిగా, ఆవాలు, జీలకర్ర – 1 టీస్పూన్, ఇంగువ – చిటికెడు, వంట సోడా – ¼ టీస్పూన్ ఉప్పు – రుచికి సరిపడా, నూనె – 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి.

ముందుగా ఒక పెద్ద మిక్సింగ్ గిన్నె తీసుకుని, అందులోకి అర కప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేయాలి. పెరుగుకు బదులుగా మజ్జిగ వాడుతుంటే 1.5 కప్పుల వరకు తీసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గడ్డలు లేకుండా బాగా కలుపుకోవాలి. రాగి పిండి, రవ్వ, పెరుగు బాగా కలిసిన తర్వాత, అర కప్పు నీళ్లు పోసి మళ్లీ కలుపాలి. ఇలా కలిపిన పిండిని 10 నిమిషాల పాటు పక్కన పెట్టి నానబెట్టాలి. రవ్వ నానడం వల్ల దోసలు చక్కగా పొంగుతాయి.

10 నిమిషాలు నానిన పిండిని ఒక మిక్సీ జార్‌లోకి తీసుకోవాలి. రవ్వ రవ్వగా ఉండకుండా, దోస పిండిలా మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. గ్రైండ్ చేసేటప్పుడు నీళ్లు కలపకుండా, పల్చగా చేయకుండా గ్రైండ్ చేసుకోవాలి. గ్రైండ్ చేసిన పిండిని తిరిగి అదే మిక్సింగ్ బౌల్‌లోకి తీసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి, 1.5 టీస్పూన్ల నూనె వేయాలి. నూనె వేడి కాగానే ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడే వరకు వేయించాలి. తరువాత చిటికెడు ఇంగువ వేసి వేయించి, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి కొద్దిసేపు వేయించుకోవాలి. ఇవి కొద్దిగా వేగిన తర్వాత, తరిగిన టమాటో ముక్కలు వేసి, టమాటోలు మెత్తబడే వరకు వేయించి, స్టవ్ ఆఫ్ చేయాలి.

ముందుగా సిద్ధం చేసుకున్న రాగి పిండిలో తరిగిన ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు, అలాగే తయారుచేసి పెట్టుకున్న పోపు మిశ్రమాన్ని వేయాలి. తరువాత రుచికి సరిపడా ఉప్పు, పావు టీస్పూన్ వంట సోడా వేయాలి. వంట సోడా వేయడం వల్ల దోసలు బాగా పొంగుతాయి, మెత్తగా వస్తాయి. ఈ పదార్థాలన్నీ పిండిలో బాగా కలిసేలా కలుపుకోవాలి.

స్టవ్ ఆన్ చేసి, చిన్న కడాయిని పెట్టి, కొద్దిగా నూనె లేదా నెయ్యి వేయాలి. కడాయి వేడి కాగానే, గరిటెతో పిండిని తీసుకుని వీడియోలో చూపించిన విధంగా చిన్న బన్ లాగా వేయాలి. ఒక వైపు కాలిన తర్వాత రెండో వైపునకు తిప్పి, రెండు వైపులా చక్కగా గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చేవరకు కాల్చుకోవాలి. చిన్న కడాయిలో వేయడం వల్ల బన్ దోస ఆకారం చక్కగా వస్తుంది, పెద్ద కడాయిలో వేస్తే సెట్ దోస లాగా వస్తుంది. ఇలాగే మిగిలిన పిండితో కూడా దోసలు తయారుచేసుకోవాలి. వేడివేడి రాగి బన్ దోసలను మీకు నచ్చిన చట్నీతో (పల్లి చట్నీ, కొబ్బరి చట్నీ, టమాటో చట్నీ) వడ్డించవచ్చు. ఇది టమాటో–పచ్చిమిర్చి చట్నీతో మరింత అద్భుతం.

మేక పాలు: ప్రయోజనాలు

భారతీయ ఆహారంలో పాలు ఒక అనివార్యమైన భాగం. పాలను మీరు వెచ్చగా లేక వేడిగా, చల్లగా లేదా అదనపు రుచులతో కలిపి తాగడానికి ఇష్టపడినా, పాలు ఖచ్చితంగా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. శరీరం యొక్క పోషక అవసరాలను తీర్చడానికి, శరీర పనితీరును చక్కగా పొందడానికి పాలు తాగడం చాలా ముఖ్యం.

పాలలో బలమైన ఎముకలు నిర్మించడానికి అవసరమైన అన్ని పోషకాలు ఉన్నాయి. ఇంకా, ఇది ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్, హృదయ సంబంధ రుగ్మతల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పాలు తాగడం వల్ల అనేక రకాల క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుందని పరిశోధకులు అంటున్నారు. పాలు తాగడం అందరికీ ముఖ్యం అయితే, శిశువులకు ఇది చాలా ముఖ్యమైనది.

ఇప్పుడు, ఏ పాలు తాగాలనేది చర్చ: ఆవు పాలా లేదా మేక పాలా? మీలో చాలా మంది ప్రతిరోజూ ఆవు పాలను తాగుతుండొచ్చు, కానీ మేక పాలు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి మీకు తెలుసా? అవును, మేక పాలు అనేక ప్రయోజనాలను మనకు కలిగిస్తాయి. ఆ ప్రయోజనాలేమిటో తెలుసుకోవడానికి ముందుకు చదవండి.

మేక పాల పోషకాంశాలు

మేక పాల ప్రయోజనాలు
బరువు తగ్గడానికి మేక పాలు
మంచి జీర్ణక్రియకు
చక్కెరవ్యాధికి
ఎముక ఆరోగ్యానికి
రుమటాయిడ్ ఆర్థరైటిస్ కోసం
మేక పాలు క్యాన్సర్‌ను నివారిస్తాయి

అమెరికా వ్యవసాయ శాఖ (యుఎస్‌డీఎ) ప్రకారం, 1 కప్పు మేక పాలు కింది పోషకాంశాల్ని కల్గి ఉంటాయి:

శక్తి: 156 కిలో కేలరీలు
ప్రోటీన్: 8 గ్రా
కొవ్వులు: 9 గ్రా
కార్బోహైడ్రేట్లు: 10 గ్రా
చక్కెర: 10 గ్రా
కాల్షియం: 300 మి.గ్రా
సోడియం: 115 మి.గ్రా
విటమిన్ సి: 2.9 మి.గ్రా
కొలెస్ట్రాల్: 24 మి.గ్రా

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 30.10.2026
www.mudranews.in | @mudranews

వాడిన నూనెను మళ్లీ వేడి చేయొద్దు

ఒకసారి వేయించడానికి ఉపయోగించిన నూనెను పదేపదే వేడి చేసి వాడటం వల్ల హానికరమైన పదార్థాలు ఏర్పడవచ్చు. నూనె రంగు మారినా, చిక్కబడినా, పొగ లేదా అసహజ వాసన వచ్చినా దాన్ని తిరిగి ఉపయోగించకూడదు. సాధ్యమైనంత వరకు నూనెను ఒక్కసారే ఉపయోగించడం ఉత్తమం.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు

శాశ్వత పరిష్కారం చూపండి

సీఎం రేవంత్ రెడ్డి వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలి

నిధులు తెచ్చే బాధ్యత నాది

ఎంపీ ఈటల రాజేందర్

ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి: జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును తరలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని, అవసరమైన నిధులు కేంద్రం నుంచి తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ ఈటల రాజేందర్ చేపట్టిన జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర మూడో రోజు కీసర నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయనకు బాధితులు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కీసరలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలిడంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. వారికి స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈటల రాజేందర్ అన్నారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే లీచేట్ నీటితో చెరువులు కలుషితమయ్యాయని, బోర్లలోనూ పచ్చటి నీరు వస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు. డంపింగ్ యార్డు నిర్వహణను చేపడుతున్న రాంకీ సంస్థ పనితీరుపైనా ఆయన విమర్శలు చేశారు. చెత్త నిర్వహణను కేవలం ఆదాయ, వ్యయాల కోణంలో కాకుండా ప్రజారోగ్య కోణంలో చూడాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా చెత్త నుంచి సంపద సృష్టించే సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయని, ఒక్క గ్రాము చెత్త కూడా వృథా కాకుండా రీసైక్లింగ్ చేసే విధానాలపై దృష్టి పెట్టాలని అన్నారు.నిధులు తెచ్చే బాధ్యత నాది..ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న తాను జవహర్‌నగర్ సమస్య పరిష్కారానికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ఈటల రాజేందర్ తెలిపారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే డీపీఆర్ తయారు చేయించాలి. నిధులు ఇప్పించే బాధ్యత నాది. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం ఉందనే నమ్మకంతోనే ఈ పాదయాత్ర ప్రారంభించాను" అని ఆయన పేర్కొన్నారు. డంపింగ్ యార్డు తొలగింపునకు సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేయలేని ప్రభుత్వం, రూ.లక్ష కోట్లతో మూసీ ప్రక్షాళన ఎలా చేపడుతుందని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ సమస్యను రాజకీయాల కోణంలో చూడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధితుల సమస్యలను పరిష్కరించాలిడంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లోని పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఈటల రాజేందర్ అన్నారు. పిల్లలు, వృద్ధులు సహా స్థానిక ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.ప్రజలు ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు వారి సమస్యలను పట్టించుకోవాలని, ప్రజలను నిచ్చెన మెట్లుగా ఉపయోగించుకుని వదిలేయకూడదని వ్యాఖ్యానించారు. జవహర్‌నగర్ బాధితుల కోసం చేపట్టిన పోరాటం డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభించే వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.రేపటి బహిరంగ సభకు హాజరుకావాలని పిలుపుజవహర్‌నగర్ డంపింగ్ యార్డు బాధితులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. రేపు జవహర్‌నగర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరై తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

నిరసనను వాయిదా వేసే ప్రసక్తే లేదు

ర్యాలీ నిర్వహించి తీరుతాం

మల్లికార్జున్ ఖర్గే

ముద్ర, న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదావేసే ప్రసక్తేలేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)' ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు. పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్‌గాంధీని కోరాయి. పెద్దఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతోపాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టంచేశారు. మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తంచేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.

చదువుకున్నవాళ్లు డిజిటల్ అరెస్టు ఎలా అవుతున్నారు?

సుప్రీంకోర్టు షాక్

ముద్ర, న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టు కేసులు పెరుగుతున్న అంశంపై సుప్రీంకోర్టు(Supreme Court) ఆందోళన వ్యక్తం చేసింది.చదువుకున్నవారు మొబైల్ ఫోన్లలో ఎలా డిజిటల్ అరెస్టు అవుతున్నారని కోర్టు షాక్ వ్యక్తం చేసింది. ప్రజల్లో అవగాహన కల్పించినా ఎలా ఇలాంటి నేరాలు జరుగుతున్నాయని అత్యున్నత న్యాయస్థానం విస్మయానికి గురైంది. డిజిటల్ అరెస్టులపై సుమోటో కేసులో సుప్రీం వాదనలు విన్నది. ఈ నేపథ్యంలో సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ.. అసలు ఈ బాధితులతో ఏం జరుగుతోంది, ఎలా బాధితులు ట్రాప్ అవుతున్నారని ఆయన వాదనల సమయంలో ఆందోళన వ్యక్తం చేశారు. చాలా బేసిక్ విషయం కూడా వాళ్లకు అర్థం కాదా, ఫోన్‌లో భయపెట్టి డిజిటల్ అరెస్టు చేస్తారా అనీ ఆయన అన్నారు. ప్రజల్లో ఏదో పొరపాటు జరుగుతోందని, అదేంటో దేవుడికే తెలియాలని, ప్రజాస్వామ్య దేశంలో ఫోన్ ద్వారా అరెస్టు అవుతున్నారంటే మీరేంటో ఆలోచిస్తున్నారా అని సీజేఐ అన్నారు. డిజిటల్ ఫ్రాడ్ కేసుల్లో బ్యాంకులు బాధ్యత తీసుకోవాలని, బాధితులకు నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. కస్టమర్లకు బ్యాంకులు ఓ రక్షణకవచంలా ఉండాలన్నారు. పదవీవిరమణ చేసిన వ్యక్తి బ్యాంక్ అకౌంట్ నుంచి భారీ మొత్తంలో విత్‌డ్రా జరుగుతుంటే, ఎందుకు బ్యాంకులు జోక్యం చేసుకోవడం లేదని సీజేఐ నేతృత్వంలోని బెంచ్ ప్రశ్నించింది.అయితే అనుమానిత లావాదేవీలను బ్యాంకులు గుర్తిస్తున్నాయని, నేరాల జరగకుండా చర్యలు తీసుకుంటున్నాయని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టులో తెలిపారు. ప్రజలతోనే ఏదో తప్పు ఉందని, దేవుడికే ఆ విషయం తెలియాలని, మీకు మీరు బాధితులవుతున్నారని, విద్యావంతులు ఫ్రాడ్‌కు గురవుతున్నారని తెలుసుకోవడం ఆందోళన కలిగిస్తోందని సీజేఐ అన్నారు.

గోవధ కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

హిందూ గ్రంథాలను ప్రస్తావించిన గుజరాత్ కోర్టు

ముద్ర, గాంధీనగర్: గోవధ కేసులో ముగ్గురు వ్యక్తులకు గుజరాత్ కోర్టు జీవిత కారాగార శిక్ష విధించింది. ఒక్కొక్కరు రూ.3 లక్షల చొప్పున జరిమానా చెల్లించాలని పేర్కొంది. ఈ తీర్పు సందర్భంగా హిందూ గ్రంథాలను కోర్టు ప్రస్తావించింది. గుజరాత్‌లోని గాంధీనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2024 ఆగస్ట్ 22న జమ్లా గ్రామంలోని ఒక ఇంటిపై పోలీసులు రైడ్ చేశారు. 277 కిలోల గొడ్డు మాంసం, ఆవులను వధించడానికి ఉపయోగించే ఆయుధాలు, మాంసాన్ని రవాణా చేసే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అరెస్ట్ చేశారు. కాగా, నిందితులైన తండ్రీకొడుకులు బలహీనంగా లేదా పాలివ్వని ఆవులను కొనుగోలు చేసి, గొడ్డు మాంసాన్ని అమ్మేందుకు వాటిని వధించేందుకు అహ్మదాబాద్ నుంచి నలుగురిని తమ ఇంటికి తీసుకువచ్చే వారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. 54 మంది సాక్షులు, 18 డాక్యుమెంటరీ సాక్ష్యాలను కోర్టుకు సమర్పించింది.మరోవైపు గాంధీనగర్ జిల్లా కోర్టు ఈ కేసుపై విచారణ జరిపింది. గోవుకు ఉన్న మతపరమైన ప్రాముఖ్యతను నొక్కిచెప్పడంతో పాటు హిందూ గ్రంథాలను ఉటంకించింది. ప్రాచీన సంస్కృత గ్రంథమైన 'మనుస్మృతి' ప్రకారం గోవు కేవలం ఒక జంతువు మాత్రమే కాదని, భౌతిక శ్రేయస్సుకు, ధర్మానికి మూలస్తంభంగా దానిని పరిగణిస్తారని కోర్టు తెలిపింది. 'తపస్సు శక్తి వల్ల భూమిపై 'అమృత' బిందువులు పడినప్పుడు, దివ్య గోవు 'కామధేనువు' ఉద్భవించింది. భూమిపై ఉన్న సమస్త గో జాతికి 'ఆది మాత'గా పరిగణిస్తారు. ఆవును 'జగత్తుకు తల్లి'గా భావిస్తారు. ఇది 33 కోట్ల దేవతలకు నిలయంగా ఉంది. దాని నాలుగు కాళ్లు నాలుగు వేదాలకు ప్రతీక' అని కోర్టు పేర్కొంది.అలాగే ఆరుగురు నిందితులలో ముగ్గురిని దోషులుగా కోర్టు నిర్ధారించింది. వసీం ఖురేషి, మహమ్మద్ రఫీక్ ఖురేషి, అస్ఫాక్ బహేలింలకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున జరిమానా విధించింది. అదనపు సెషన్స్ జడ్జి బి.ఆర్. రాజ్‌పుత్, అక్టోబర్ 26న ఈ తీర్పును వెలువరించారు.గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి ఈ తీర్పును స్వాగతించారు. రాష్ట్రంలో గోవధకు పాల్పడేవారిని చట్టం వదిలిపెట్టదనే స్పష్టమైన సందేశాన్ని ఈ తీర్పు ఇచ్చిందన్నారు. అయితే 1954 నాటి 'గుజరాత్ పశు సంరక్షణ చట్టం'ను 2017లో సవరించారు. గోవధకు విధించే శిక్షను 'జీవిత ఖైదు'గా గుజరాత్ ప్రభుత్వం పెంచింది. తద్వారా ఈ నేరానికి అలాంటి శిక్షను నిర్ణయించిన దేశంలోని మొదటి రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది.

మలేషియాలో ఉద్యోగం పేరిట లక్షల రూపాయల మోసం

కేపీహెచ్‌బీ 'బెల్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' గుట్టురట్టు

ముద్ర, కూకట్‌పల్లి : మలేషియాలో డేటా ఎంట్రీ సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, పలువురు నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన ఘటన హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది.ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా నాయుడుపేటకు చెందిన నారేడ్ల బాలగంగాధర్ రావు (36)కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కేపీహెచ్‌బీ కాలనీలోని మంజీరా ట్రినిటీ కాంప్లెక్స్‌లో 'బెల్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' పేరుతో కన్సల్టెన్సీ నడుపుతున్న బల్లె నరేష్ పరిచయమయ్యాడు. మలేషియాలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో, బాలగంగాధర్ రావు అక్టోబర్ 2న సదరు ఆఫీసుకు వెళ్లాడు. అక్కడ నరేష్‌తో పాటు జగవీర్ పిళ్లెలా అనే వ్యక్తి అతడి నుంచి రూ.2,42,000 నగదుతో పాటు విద్యార్హతల ధృవీకరణ పత్రాలను తీసుకుని ఒప్పందం కుదుర్చుకున్నారు.బాధితుడు వారి మాటలు నమ్మి అక్టోబర్ 12న మలేషియా చేరుకోగా, అక్కడ అతడిని స్వీకరించేందుకు ఎవరూ రాలేదు. అనంతరం ఒక ఏజెంట్ ఫోన్ చేసి, సింగపూర్ సరిహద్దు సమీపంలోని ఒక తెలియని ప్రాంతానికి రావాలని ఆదేశించి, అతడి పాస్‌పోర్ట్‌ను తన వద్దే ఉంచుకున్నాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు స్వదేశానికి తిరిగి వెళ్తానని చెప్పగా, మరో రూ.3 లక్షలు ఇస్తేనే పాస్‌పోర్ట్ ఇస్తామని బెదిరింపులకు దిగారు. చివరకు ఏపీఎన్ఆర్‌టీఎస్ (APNRTS) సహాయంతో బాలగంగాధర్ రావు అక్టోబర్ 25న క్షేమంగా భారత్ చేరుకున్నాడు.ఇదే తరహాలో హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌కు చెందిన తిరుపాల్ (31) అనే వ్యక్తి నుంచి కూడా సదరు కన్సల్టెన్సీ నిర్వాహకులు రూ.1,80,000 వసూలు చేసి మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అక్టోబర్ 26న కేసు నమోదు చేసిన పోలీసులు, బల్లె నరేష్, జగవీర్ పిళ్లెలాపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.

రాత్రివేళ దోపిడీకి పాల్పడిన ముగ్గురు ముఠా సభ్యులు అరెస్ట్

ఒక బాలుడి పట్టివేత

ముద్ర, కూకట్‌పల్లి : అర్ధరాత్రి వేళ ఒంటరిగా వెళ్తున్న యువకుడిని అడ్డుకుని దోపిడీకి పాల్పడిన ముఠాను కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు ఒక బాల నిందితుడి (సీసీఎల్)ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 28న తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో కేపీహెచ్‌బీ డీ-ఫిన్ హాస్టల్‌లో ఉంటూ డేటా సైన్స్ కోచింగ్ తీసుకుంటున్న షేక్ గనీ అనే యువకుడు భోజనం చేసి ద్విచక్రవాహనంపై వస్తుండగా, మలేషియన్ టౌన్‌షిప్ బస్‌స్టాప్ వద్ద ఆటోలో వచ్చిన కొందరు వ్యక్తులు అతడిని అడ్డుకున్నారు. బాధితుడిని బెదిరించి, దాడి చేసి బలవంతంగా ఫోన్‌పే ద్వారా రూ.6,000 బదిలీ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ 309(6) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఎస్. అనిల్ (PC 9552), కె. శ్రీనివాసరావు (PC 757) సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించి, వారిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు. పోలీసు బృందం నెక్సస్ మాల్ సమీపంలో దాడి చేసి కూకట్‌పల్లికి చెందిన వల్లేటి రాజేష్ (24), బోయిన బాలరాజు (29), కోనతం మణికంఠ (26)లతో పాటు మరో బాలుడిని అదుపులోకి తీసుకుంది. నిందితుల నుంచి 5 మొబైల్ ఫోన్లు మరియు నేరానికి ఉపయోగించిన ఆటో రిక్షా (TG 34 T 3870)ను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన కానిస్టేబుళ్లు అనిల్, శ్రీనివాసరావుతో పాటు క్రైమ్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

మున్సిపల్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్ కన్నెర్ర

హుజూర్‌నగర్‌లో 192 గజాల స్థలం వివాదం

ముగ్గురు అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం

అవుట్‌సోర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్ తొలగింపు

15 రోజుల్లో సమగ్ర విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశం

ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 29: హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తుల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తీవ్రంగా స్పందించారు. మున్సిపల్ ఆస్తి పన్ను రికార్డులను అక్రమంగా సృష్టించి, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు వచ్చిన ఆరోపణలపై ముగ్గురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో క్రిమినల్ ఫిర్యాదు చేయడంతోపాటు సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు.హుజూర్‌నగర్‌లో సుమారు 192 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న మున్సిపల్ బావి, దాని పక్కనున్న స్థలానికి సంబంధించి వివాదం తలెత్తింది. ఈ స్థలానికి అక్రమంగా ఆస్తి పన్ను మదింపు రికార్డులు సృష్టించి, ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. హుజూర్‌నగర్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సమర్పించిన నివేదికల ఆధారంగా కలెక్టర్ చర్యలకు ఆదేశించారు.ముగ్గురు అధికారులపై చర్యలుఆస్తి రికార్డుల సృష్టి, ధ్రువీకరణ, ప్రాసెసింగ్‌లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవెన్యూ ఆఫీసర్/రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్‌పై నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వారు ప్రస్తుతం ఎక్కడ విధులు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత అవుట్‌సోర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.క్రిమినల్ ఫిర్యాదుకు ఆదేశంమున్సిపల్ ఆస్తి రికార్డులను మోసపూరితంగా సృష్టించడం, దుర్వినియోగం చేయడం, అక్రమ లావాదేవీల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వివాదాస్పద స్థలం యాజమాన్యం, విస్తీర్ణం, హద్దులను నిర్ధారించి రికార్డులను చట్టప్రకారం సరిచేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సంబంధిత సబ్ రిజిస్ట్రార్ నుంచి నివేదిక కోరారు.ఇతర మున్సిపల్ ఆస్తులపైనా విచారణజిల్లాలోని మున్సిపల్ భూములు, బావులు, రోడ్లు, ప్రజా స్థలాలు, ఇతర ఆస్తులకు సంబంధించి ఇలాంటి అక్రమాలు జరిగాయా అనే అంశంపైనా విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్రను పరిశీలించి 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

అసంపూర్తి పనులకు ప్రారంభోత్సవాలు

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: అసంపూర్తిగా ఉన్న సైడు కాలువ పనులకు మంత్రి ధనసరి సీతక్క ప్రారంభోత్సవం చేయడం విడ్డూరంగా ఉందని ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండల కేంద్రానికి చెందిన ఎస్సీ కాలనీ వాసి కుక్క అశోక్ విమర్శించారు. గత మే నెలలో ఎస్సీ కాలనీలో సుమారు 100 మీటర్ల పొడవున సైడు కాలువ నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. అయితే కాలువకు ఇరువైపులా మట్టి నింపే పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదని ఆరోపించారు. కాలువ పక్కన మట్టి నింపకుండా వదిలేశారన్నారు.అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత ఏఈ, డీఈ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితిని పరిశీలించకుండా మంత్రితో ప్రారంభోత్సవం చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ ప్రచారం కోసమే హడావుడిగా ప్రారంభోత్సవం నిర్వహించారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువకు ఇరువైపులా మట్టి నింపే పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోండి!

సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, బరువును అదుపులో ఉంచుకోవడం గుండె ఆరోగ్యానికి కీలకం. ఇప్పటికే అధిక కొలెస్ట్రాల్, మధుమేహం లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు ఆహారంలో మార్పులు చేసుకోవాలి.

గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు

- శైలజా రామయ్యర్

ముద్ర, మంథని గ్రామీణం: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతోందని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల పురోగతిని, ఆలయ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. మంథనికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున టైర్–1 కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పుష్కర ఘాట్ ను విస్తరించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ఓదెల, రామగుండం ప్రాంతాల్లోనూ చిన్న పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.10 కోట్ల వ్యయంతో ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు.

మియాపూర్‌లో 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

- సుప్రీం కీలక తీర్పు

ముద్ర, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వే నెంబర్ 100, 101లో భూ వివాదంపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. ఈ రెండు సర్వే నెంబర్లలో 550ఎకరాల భూమి తమదేనంటూ కొందరు గతంలో ఆక్రమించే ప్రయత్నం చేశారు. అయితే.. 2003లో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులోప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను ఇవాళ సుప్రీంకోర్టు కొట్టివేసింది. 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమి పరిరక్షణకు చూపిన ప్రత్యేక చొరవను కోర్టు అభినందించింది.

వాస్తవానికి మియాపూర్ భూములకు సంబంధించి, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ తీసుకున్న నిర్ణయాన్ని 2003లోనే ఉమ్మడి హైకోర్టు సమర్థించింది. ఈ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా ఇతరుల నుంచి చట్టబద్ధంగా పొందామని, తమ 'Irrevocable GPA', 'సనద్' హక్కులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని పార్థసారధి, సువిశాల్ జైన్‌లు కోర్టును అభ్యర్థించారు. రిజిస్టర్డ్ పత్రాలను రద్దు చేసే అధికారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు లేదని కోర్టులో వాదించారు. ఈవాదనలపై ప్రభుత్వ న్యాయవాదులు కూడా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. జాగీర్దార్ కైసరుద్దీన్‌కు అప్పట్లోనే పరిహారం చెల్లించినందున ఈ భూములపై ఎలాంటి హక్కులను క్లెయిమ్ చేసే అవకాశం వారసులుగా చెబుతున్న వారికి లేదని స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా అనుమతించబోమని, ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

నిమ్స్‌లో అవినీతిపై ఉక్కుపాదం..

ఒకేసారి మూడు శాఖల తనిఖీలు!

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మక నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రిలో వేళ్లూనుకున్న అవినీతిపై అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలకు చెందిన అధికారులు గురువారం ఏకకాలంలో ఆసుపత్రి ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒకేసారి మూడు కీలక శాఖల అధికారులు రంగంలోకి దిగడంతో నిమ్స్ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది.

నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ అవినీతి కేసు విచారణలో లభించిన కీలక ఆధారాలు, లింకుల ఆధారంగానే ఏసీబీ ఈ సోదాలు చేపట్టింది. ఆసుపత్రిలోని మెడికల్ స్టోర్స్, సర్జికల్ స్టోర్స్, క్యాంటీన్ల నిర్వహణ నుంచి కీలక స్థానాల్లో ఉన్న కొందరు ఉన్నతాధికారులకు ఏటా భారీగా ముడుపులు అందుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఒక్క క్యాంటీన్, మందుల దుకాణాల నుంచే ప్రతి ఏటా సుమారు రూ.50 లక్షల మేర లంచాల రూపంలో చేతులు మారుతున్నట్లు ప్రాథమిక ఆధారాలు లభ్యమయ్యాయి.సుమారు పది మంది ఏసీబీ అధికారుల బృందం నిమ్స్ పరిపాలనా విభాగాన్ని (అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్) తమ ఆధీనంలోకి తీసుకుని సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. అనుమతులు, టెండర్లు, బిల్లుల చెల్లింపులకు సంబంధించిన కీలక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. మరోవైపు, రోగులు, వారి బంధువులకు నాణ్యతలేని ఆహారాన్ని విక్రయిస్తున్నారన్న ఆరోపణలతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు చెందిన నాలుగు ప్రత్యేక బృందాలు నిమ్స్ క్యాంటీన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఆహార పదార్థాల నాణ్యత, వంటగది పరిశుభ్రత, నిల్వలను పరిశీలించి శాంపిళ్లను సేకరించాయి. అదే సమయంలో, ఆసుపత్రిలోని సర్జికల్ స్టోర్‌లో నలుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బృందం తనిఖీలు చేపట్టింది. రోగులకు సరఫరా చేస్తున్న సర్జికల్ పరికరాలు, ప్రాణరక్షక ఔషధాల నిల్వలు, వాటి కొనుగోలు రికార్డులు, గడువు ముగిసిన మందుల అంశాలపై ఆరా తీస్తున్నారు. ఆసుపత్రిలో అవినీతికి పాల్పడుతూ నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారుల జాబితాను ఏసీబీ సిద్ధం చేస్తోంది. ఈ సోదాల అనంతరం నిమ్స్‌లోని పలువురు కీలక అధికారులపై మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జనగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా చేర్చాలి

కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.. మంత్రి పొన్నం ప్రభాకర్

బీసీలకు న్యాయం జరగాలంటే కుల గణన అవసరం

ముద్ర, హైదరాబాద్ : దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జనగణనలో కుల గణనను కూడా చేపట్టాలని, అందులో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌ను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యను కోరారు. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కలిశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో ఓబీసీ కుల గణనను చేర్చాల్సిన ఆవశ్యకతపై ఇరువురు చర్చించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన నిర్వహిస్తామని ప్రకటించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. అయితే ఆగస్టు 14న విడుదల చేసిన 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీ, ఇతరులు అనే విభాగాలు ఉన్నప్పటికీ, ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ లేదని పేర్కొన్నారు. కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించకపోతే ఓబీసీల వాస్తవ జనాభా ఎంతన్నది స్పష్టంగా తెలియదని అన్నారు.

రిజర్వేషన్లకు కుల గణన కీలకం

రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచాలని కోర్టుల్లో అభ్యర్థించిన సందర్భాల్లో ఖచ్చితమైన కులాల వారీ జనాభా వివరాలు (ఎంపైరికల్ డేటా) అవసరమవుతున్నాయని మంత్రి తెలిపారు. జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చడం ద్వారా బీసీల జనాభాకు సంబంధించిన స్పష్టమైన గణాంకాలు లభిస్తాయని పేర్కొన్నారు. 2011 తర్వాత ప్రస్తుతం జనాభా లెక్కలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓబీసీ కుల గణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆర్. కృష్ణయ్యను కోరారు.

అమిత్ షాను కలిసి డిమాండ్ చేయాలి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా త్వరలో తెలంగాణకు రానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల ప్రతినిధులను సమన్వయం చేసుకుని ఆయనను కలవాలని మంత్రి సూచించారు. జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలనే ఏకైక డిమాండ్‌తో కేంద్ర హోంమంత్రికి విజ్ఞప్తి చేయాలని ఆర్. కృష్ణయ్యను కోరారు.

తెలంగాణ శాసనసభ ఇప్పటికే కేంద్ర జనగణనలో కుల గణనను చేర్చాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఓబీసీ కాలమ్ చేర్చడం వల్ల బీసీల జనాభాపై ఖచ్చితమైన వివరాలు లభిస్తాయని, వాటి ఆధారంగా చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు పెంచేందుకు, బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు చేయడానికి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ప్రక్రియను సులభతరం చేసేందుకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలంటే కుల గణన అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

సూపర్ ఎల్‌నినో కోసం ముందస్తు చర్యలు

ముద్ర ప్రతినిధి, కరీంనగర్ : సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు యాసంగిలో వరి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, రైతులకు మద్దతు ధర అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

మంథనికి అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి రాక

నవంబర్ 1న ధన్వాడ, మంథని గ్రామాల సందర్శన
దత్తాత్రేయ స్వామి దర్శనం.. భక్తులకు అనుగ్రహ భాషణం
స్వామివారి రాకతో ఆధ్యాత్మిక సందడి

ముద్ర ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని ప్రాంతానికి నవంబర్ 1న ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. మైసూరులోని అవధూత దత్తపీఠాధిపతి, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ధన్వాడ, మంథని గ్రామాలను సందర్శించనున్నారు. ఆయా ప్రాంతాల్లో కొలువైన దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని భక్తులకు అనుగ్రహ భాషణం చేయనున్నారు. స్వామివారి రాక నేపథ్యంలో భక్తులు, ఆధ్యాత్మిక అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

దత్త సంప్రదాయానికి విశేష సేవలు

గణపతి సచ్చిదానంద స్వామీజీ దేశ విదేశాల్లో ఆధ్యాత్మిక గురువుగా విశేష గుర్తింపు పొందారు. కర్ణాటకలోని మైసూరును ప్రధాన కేంద్రంగా చేసుకుని అవధూత దత్తపీఠం ద్వారా ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దత్తాత్రేయ స్వామివారి తత్వాన్ని ప్రజలకు చేరువ చేయడం, భక్తిలోని అంతరార్థాన్ని వివరించడం, మానవతా విలువలను పెంపొందించడం స్వామీజీ బోధనల్లో ప్రధానాంశాలు.

భక్తి, సంగీతం, మానవతకు ప్రాధాన్యం

స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలతో పాటు భజనలు, ధ్యాన సంగీతం ద్వారా కూడా భక్తులను ఆకట్టుకుంటారు. సంస్కృతం, కన్నడ, తెలుగు, హిందీ భాషల్లో అనేక భక్తిగీతాలను రచించారు. సంగీతాన్ని మనసుకు ప్రశాంతతను అందించే సాధనంగా ప్రోత్సహిస్తూ, యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక సాధనలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్య, వైద్యం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలకు కూడా ఆయన ప్రోత్సాహం అందిస్తున్నారు.

దత్తాత్రేయ స్వామి దర్శనం.. భక్తులకు అనుగ్రహం

నవంబర్ 1న ధన్వాడలో ఉదయం కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం మంథనిలోని శివకిరణ్ గార్డెన్స్‌లో పాదపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకానున్నట్లు సమాచారం. స్వామీజీ పర్యటనతో మంథని, ధన్వాడ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. దత్తాత్రేయ స్వామివారి పట్ల భక్తి విశ్వాసాలు కలిగిన భక్తులకు స్వామీజీ దర్శనం, అనుగ్రహ భాషణం ఆధ్యాత్మికంగా ప్రత్యేక అనుభూతిని అందించనున్నాయి. స్వామివారి సందేశాలను ఆలకించి, ఆయన ఆశీస్సులు పొందేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

తెలంగాణ ఎదుగుతోంది..

ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములు కండి: సీఎం రేవంత్

ముద్ర, హైదరాబాద్ : రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నప్పటికీ.. హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి అంతా మద్దతుగా నిలిచారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమిట్ కోసం దిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సులో పాల్గొన్న సీఎం.. సమిట్ కు అందరినీ ఆహ్వానించారు.

400 ఏళ్ల క్రితమే ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్..

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "సుమారు 400 ఏళ్ల క్రితమే హైదరాబాద్ ఒక ప్రపంచస్థాయి నగరంగా వెలుగులీనింది. ప్రపంచంలోని అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్ లోని చార్మినార్ పరిసరాలకు వచ్చి వ్యాపారాలు చేసేవారు. ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, వెండి నకాషీ కళాకృతులను కొనుగోలు చేసేవారు. నిజాం పాలకులు అద్భుతమైన కట్టడాలు, ప్రపంచస్థాయి మ్యూజియం, టంక శాల (నాణేల ముద్రణాలయం), విమానాశ్రయం, రైల్వేలు, అత్యుత్తమ విద్యా సంస్థలతో హైద రాబాద్ ను అభివృద్ధి చేశారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రపంచం గ ర్వించే మేధో నిపుణులు, నాయ కుల ను అందించింది. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ప్రేమ్ వత్స వంటి ప్రముఖులంతా ఇక్కడ చదువుకున్నవారే. విదేశీ పెట్టుబ డులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను తయారు చేయడంలో హైదరాబాద్ కు ప్రత్యేకత ఉంది.

భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో.. దేశ ఆర్థిక ప్రగతికి బాటలు వేసిన మహా నేతలను మ నం

స్మరించుకోవాలి. ఈరోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల సమక్షంలో నిలబడి, దేశ ప్రగతికి బాటలు వేసిన ఆ మహానేతలకు సెల్యూట్ చేస్తున్నా. అతి పిన్న వయసులో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. నేడు ఫోన్ , ఇంటర్నెట్ లేని జీవితాన్ని మనం ఊహించలేం. రాజీవ్ గాంధీ హైదరాబాద్ లో పైలట్ శిక్షణ పొంది.. పైలట్ గా కూడా పనిచేశారు. అందుకే హైదరాబాద్ లోని ప్రపంచస్థాయి విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టుకున్నాం.

మీ పెట్టుబడులకు భద్రత కల్పిస్తాం..

తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావు 1991లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు ఆయన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్ పీజీ) సంస్కరణలను అమలు చేశారు. హైదరాబాద్ జీవ నంలోనే ప్రపంచస్థాయి దృక్పథం ఉంది.

సంస్కరణలను స్వీకరించే తత్వం, పారిశ్రామిక స్ఫూర్తి ఉన్నాయి. తెలంగాణలో మీరు పెట్టే పెట్టుబడులకు భద్రత కల్పించడం, అవి వృద్ధి చెందేలా చూడడం నా వ్యక్తిగత బాధ్యత. మీ పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటా. మీరు తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో ముందుగా మీ మనసులో ఒక సంఖ్యను నిర్ణయించుకుని.. ఆ మొత్తాన్ని ఇప్పుడు రెట్టింపు చేయండి. విధానపరమైన నిర్ణయాలైనా, ప్రభుత్వ సహకారమైనా, మీకు అవసరమైన మద్దతు అందించే బాధ్యతను నేను తీసుకుంటా.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరిస్తోంది

'తెలంగాణ రైజింగ్ 2047' రాష్ట్ర భవిష్యత్ ప్రణాళిక. ఇది 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా ఉంది. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలి. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉంది. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో మూడు హైదరాబాద్ కు అనుసంధానం కానున్నాయి. హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ –బెంగళూరు, హైదరాబాద్ –పుణె మార్గాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. వరంగల్ , ఆదిలాబాద్ లలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం ద్వారా కూడా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరిస్తోంది. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి మెట్రో రైలు విస్తరణ వరకు, నేవీ రాడార్ కేంద్రం నుంచి అనేక ఇతర అభివృద్ధి కార్యక్రమాల వరకు కేంద్రం నుంచి సహకారం పొందుతున్నాం. హైదరాబాద్.. దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు వంటి నగరాలతో పోటీ ప డ దు. న్యూయార్క్ , లండన్ , టోక్యో, సియోల్ , దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. తెలంగాణ అభివృద్ధికి మీ అత్యుత్తమ ఆలోచనలను అందించండి. తెలంగాణ ఎదుగుతోంది.. ఈ ప్రగతి ప్రస్థానంలో మీరూ భాగస్వాములు కండి. మనమంతా కలిసి ఎదుగుతూ చరిత్ర సృష్టిద్దాం" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 30.10.2026
www.mudranews.in | @mudranews

వంట నూనెలను తెలివిగా ఎంచుకోండి

వేరుశెనగ నూనె, సూర్యకాంతి నూనె, తవుడు నూనె, నువ్వుల నూనె వంటి వాటిని ఆహార అవసరాలకు అనుగుణంగా ఎంచుకోవచ్చు. ఒకే నూనెపై ఆధారపడకుండా, అసంతృప్త కొవ్వులు అధికంగా ఉండే నూనెలకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. అయితే నూనెలను మార్చి వాడటం ఒక్కటే ఆరోగ్యానికి హామీ కాదు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుపై నిర్లక్ష్యం ఎందుకు?

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఎక్కడ?
బీఎల్ఓలు ఏమయ్యారు?
క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలేవీ?
అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కుకు దూరమైతే బాధ్యులెవరు?
ఎన్నికల యంత్రాంగం మౌనంపై ప్రశ్నల వర్షం

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరించే ఎన్నికల యంత్రాంగం, పట్టభద్రుల ఓటర్ల నమోదు విషయంలో ఎందుకు అదే స్థాయిలో చొరవ చూపడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అర్హులైన పట్టభద్రులకు నమోదు ప్రక్రియపై సరైన అవగాహన కల్పించకపోతే వారు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది.

బీఎల్ఓల పాత్ర ఏమిటి?

గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ఎంతమేర ప్రచారం నిర్వహిస్తున్నారు? అర్హులైన వారికి దరఖాస్తు విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, గడువు వివరాలను తెలియజేస్తున్నారా? నమోదు ప్రక్రియలో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓలు) పాత్ర ఏమిటి? సంబంధిత ఎన్నికల సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటున్నారా? అనే ప్రశ్నలకు అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. సాధారణ ఓటర్ల జాబితా సవరణకు చూపే శ్రద్ధను పట్టభద్రుల ఓటర్ల నమోదుపైనా చూపాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేవలం రాజకీయ పార్టీల బాధ్యత కాదు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి పట్టభద్రుడికి నమోదు చేసుకునే అవకాశం కల్పించడం ఎన్నికల యంత్రాంగం బాధ్యత. అయితే, నమోదు ప్రక్రియపై జిల్లా, మండల స్థాయిలో ఎంతవరకు పర్యవేక్షణ జరుగుతోందనే అంశంపై స్పష్టత అవసరం. ప్రజలే కార్యాలయాల చుట్టూ తిరిగి వివరాలు తెలుసుకోవాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు ముందస్తుగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?ములుగు జిల్లాలో ఇప్పటివరకు ఎంతమంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు? మండలాలవారీగా ఎన్ని దరఖాస్తులు అందాయి? ఎన్ని పరిశీలనలో ఉన్నాయి? ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి? ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు? అనే వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఇప్పటికైనా స్పందించాలి!

పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని, మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచిస్తున్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రశ్న ఒక్కటే.. బాధ్యత ఎవరిది?

ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే సరిపోదు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవసరమైన సమాచారం, సహకారం అందించాలి. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. ఆ హక్కును వినియోగించుకునే అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగానిదే. పట్టభద్రుల ఓటర్ల నమోదు విషయంలో తలెత్తుతున్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తాం

వెంకటాపూర్‌లో సీసీ రోడ్లు, డ్రైయిన్ల ప్రారంభం
మంత్రి సీతక్క

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని విధాలా కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ శ్రీనివాస్‌తోపాటు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వెంకటాపూర్ మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. సీఆర్ఆర్ (ప్లెయిన్) 2025–26 నిధులతో రూ.54 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, సీఆర్ఆర్ (ఎస్‌సీపీ) 2024–25 నిధులతో రూ.45 లక్షల అంచనా వ్యయంతో సీసీ డ్రెయిన్ల పనులు చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గతంలో కాలనీలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్, నాయకుల సూచనలు, సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.ఆశించిన మేర వర్షాలు కురవని నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, ప్రతి కుటుంబం నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.గ్రామాల సమగ్రాభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల పట్ల సీఎం వైఖరి మార్చుకోవాలి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల పట్ల సీఎం వైఖరి మార్చుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు వేముల హరికృష్ణ అన్నారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కళాకారులకు తక్షణమే తెలంగాణ సాంస్కృతిక సారధి (టీ ఎస్ ఎస్)లో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో వలన ఏర్పడిన కరువు పట్ల ప్రజలకు అవగాహన కల్పించ డానికి టి ఎస్ ఎస్ కళాకారులతోపాటు బయట ఉన్న కళాకారులను వారి సేవలను వాడుకోవాలని మాట్లాడిన మాటలను జిల్లా కళాకారులందరూ తీవ్రంగా ఖండించారు. మా సేవలను మీ అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలనుకోవడం సరికాదు మాకు ఉద్యోగాలు కల్పించి మమ్మల్ని కూడా ప్రభుత్వంలో సాంస్కృతిక సారధి లో భాగస్వాములు చేసి తగిన జీత బత్యాలు కల్పించితే మేము కూడా పని చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గందమల్ల శివశంకర్, కోశాధికారి మల్లం వెంకటేశం, సంఘం గౌరవ అధ్యక్షులు కోట బిక్షపతి, ప్రచార కార్యదర్శి సురుపంగ గణేష్, కళాకారులు నకిరేకంటి రవి, ధీరజ్ మాస్టర్, భరత్ మాస్టర్, పోలేపల్లి నరసింహ, బూడిద కిషన్, పెంటేష్, పుష్ప, బాలమని, పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ డీ నుంచి బిసి ఏ కు మార్చాలి

భువనగిరి పట్టణంలో పండుగల సాయన్న ముదిరాజు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ముదిరాజులను బీసీ డీ నుంచి బిసి ఏ కు మార్చి భువనగిరి పట్టణంలో పండుగల సాయన్న ముదిరాజు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భువనగిరి పట్టణంలో ముదిరాజ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్ ముదిరాజ్, ప్రధనా కార్యదర్శి నీలం శ్రీనివాస్ ముదిరాజు ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో ముదిరాజుల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముదిరాజు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండుగల సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడాన్ని మొదటి విజయంగా వర్ణించారు. ముదిరాజుల ఏకైక కోరిక బీసీ డీ నుంచి బిసి ఏ కు మార్చాలన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంట నరసింహ ముదిరాజు, జిల్లా నాయకులు కుక్కదువు సోమయ్య, మాజీ జిల్లా రైతు సమితి అధ్యక్షులు కొల్పుల అమరేందర్, ఇట్టబోయిన గోపాల్, సాధు విజయ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త దిడ్డి కాడి నర్సింగరావు, కౌన్సిలర్లు నాయిని పూర్ణచందర్, గుర్రాల శ్రీనివాస్, తుమ్మల నాగేష్, నాయకులు తుమ్మల పాండు, పిట్టల బాలరాజు, భగత్, బిస్కుంట్ల సత్య నారాయణ, మాటూరు అశోక్, మాటూరు బాలేశ్వర్, జంగిటి రవి, గోరింకల శివ శంకర్, కుక్కుదువు కృష్ణ, మొలకల సత్య నారాయణ, ఉడత భాస్కర్, సిదంకి కోటయ్య, కస్తూరి పాండు, శాగంటి నరసింహ, గుర్రాల మల్లేశ్, కాలభైరవ, యాట కుమార్, డొప్ప వెంకటేష్, కనక బాలరాజు, శివ నాగేందర్, పోతరాజుల రవీందర్, బండి కృష్ణ, భరిగ శంకర్, సొప్పరి రమేష్, ఎనబోయిన చంద్రశేఖర్, పెంట వినయ్, పిట్టల రాములు, కొలుపుల పెద్ద కృష్ణ, ఎనబోయిన లింగమూర్తి, పెంట బోయిన నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక హారంతో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి, వారితో పాఠ్యపుస్తకాలను చదివించారు. వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, చదువుపై ఏకాగ్రత ఎలా పెంచుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా చదువుతూ, ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించనున్న ఆహార పదార్థాల నాణ్యతను, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారి బిక్షపతి, ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాలల స్నేహపూర్వక జిల్లాగా సూర్యాపేట

ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 29: పిల్లల హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛ, మానసిక వికాసం, అభిరుచులకు ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో యూనిసెఫ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అధికారి బాలల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలు తమ హక్కులు, స్వేచ్ఛను పూర్తిస్థాయిలో అనుభవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, అభిరుచులను గుర్తించి, వారి ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించేలా ప్రోత్సహించాలని కోరారు. యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా రెవెన్యూ అధికారి రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, సీడీపీవోలు పాల్గొన్నారు.

దేవాదుల పైప్‌లైన్ లీకేజీ

నర్సింగాపూర్ పక్కన లీకేజీతో ఎగిసిపడుతున్న దేవాదుల నీరు

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట సమీపంలోని నర్సింగాపూర్ పక్కన దేవాదుల పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు భారీగా ఎగిసిపడుతోంది. పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా బయటకు వస్తుండటంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కోర్టు కమిటీ అధ్యక్షుడిగా యాదసు యాదయ్య

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : రామన్నపేట కోర్టు కాంప్లెక్స్ లోని కోర్టు కమిటీ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అధ్యక్షుడిగా అడ్వకేట్ యాదాసు యాదయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా పాల్వంచ జగతయ్య, ఉపాధ్యక్షుడిగా అంకం నరేష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం నరసింహ, సభ్యులుగా జితేందర్, తాటిపాముల కిరణ్ కుమార్, బాలరాజు, లను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు యాదాసు యాదయ్య మాట్లాడుతూ రాజ్యాంగం లోని ఆశయాలనే ఐలు ఆశయాలుగా పని చేసి ఆలిండియా లాయర్స్ యూనియన్ ఐ లు న్యాయవాదుల సంక్షేమం, రాజ్యాంగా న్నీ, న్యాయవ్యవస్థను పరిరక్షించి అత్యున్నతమైన ఆశయాల కోసంల పనిచేస్తుందని ఆయన అన్నారు. 31న భువనగిరి లోని న్యూ వివేరా లో జరిగే ఐలు జిల్లా రెండవ మహాసభలను చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా వచ్చే రాజ్యాంగ పరిరక్షణ న్యాయవాదుల పాత్ర అనే అంశంపై జరిగే సెమినార్ను జయప్రదం చేయాలని కోరారు.

అర్నబ్ ప్రభావానికి నేలకొరిగిన వరి పంట

వెంకటాపూర్ మండలంలో రైతులకు నష్టం

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని లక్ష్మీదేవి పేట గ్రామ శివారులో ఆర్నాబ్ ప్రభావంతో వరి పంట నేలకొరిగింది. పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది.సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి, బాధిత రైతులకు తగిన సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు 21 రకాల సదుపాయాలు వంద శాతం అందేలా చూడాలి

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: తాడ్వాయి మండలంలోని మండల వనరుల కేంద్రాన్ని (ఎం ఆర్ సి) ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న విద్యార్థుల అవసర వస్తువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాం వస్త్రాలు, ఐడీ కార్డులు, బెల్టులు, బ్లాక్ షూస్, వైట్ షూస్, సాక్సులు, ట్రాక్ షూస్, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ బాక్సులు, దుప్పట్లు, నైట్ డ్రెస్‌లు తదితర 21 రకాల వస్తువుల పంపిణీ వివరాలను పరిశీలించారు.ప్రతి విద్యార్థికి నిర్దేశించిన అన్ని వస్తువులు పూర్తిస్థాయిలో అందాయా లేదా రికార్డుల ద్వారా ధృవీకరించాలని, అర్హులైన విద్యార్థులందరికీ 100 శాతం వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. తాడ్వాయి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏడో రోజు కొనసాగిన వలంటీర్స్ శిక్షణ శిబిరం

ఆలంరించిన పేరిణి నృత్య ప్రదర్శనలు

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 29: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్పలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం ఏడో రోజు కోనసాగింది. ఉదయం యోగ గురువు యోగి రాంబాబు ఆధ్వర్యంలో యోగసానాలు నేర్పించారు. నిథిమ్ అసిస్టెంట్ ప్రొపెసర్ గోవిందరాజు రోల్ ఆఫ్ టూరిజం ప్రమోషన్ ఇన లైట్ ఆఫ్ రామప్ప ఇన్స్క్రిబడ్ పై వివరించారు. కేంద్ర పురావస్తు శాఖ సూపరెండింట్ నిఖిల్ దాస్ హంపి ప్రపంచ వారసత్వం గుర్పింపు పోందిన తర్వాత కేంద్ర పురావస్తు, టూరిజం శాఖలు చేసిన అభివృద్ధి పై వివరించారు. కేంద్ర పురావస్తు శాఖ డీఈ కృష్ణ చైతన్య వారసత్వ కట్టడాల పునర్నిర్మాణంలో చేసే వివిధ కార్యక్రమలైన డాకుమెంటేషన్, నిర్మాణ వస్తువుల ఎంపిక, కోలతలు, ప్రమాణాలు గురించి వివరించారు. సాయంత్రం రామప్ప దేవాలయ నాట్య మండపం లో పేరిణి నాట్యం బృంద నాయకులు గురిశ్రీ, పేరిణి ప్రవీణ శ్రీ గజ్జెల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో గణపతి గద్య, .బ్రహ్మ గద్య, వినుడి వినుడి పేరిణి, మేళా ప్రాప్తి, తహనం, సమయతి, ధమరుక యతి, పిపిలక యతి, భవాని కౌతం, దేవి కైవరం, జయము జయము, శివ పంచభూత శబ్దలు తథితర అంశాలపై ప్రదర్శనలను పేరిణి నృత్య కళాకారులుపల్నాటి శ్రీజ, బండారి తేజస్విని, గడ్డం విద్యా, తుమ్మ వైష్ణవి, శ్రీ మహాలక్ష్మి , తుమ్మ సాన్విక, తొడసం గురదేవ్, తోడెన్గా సంతోష్, అన్నెల దేవి రాజేష్ నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమం లో ప్రొపెసర్ పాండు రంగారావు, పోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీధర్ రావు, కేంద్ర పురావస్తు శాఖ , సీఏ లు మల్లేష్, భరత్, పురావస్తు శాఖ సిబ్బంది, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, టూరిజం గైడ్ విజయ్ కుమార్, టూరిస్ట్ పోలిసులు బద్రు, దశరథ్, అరుణ్, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది, వాలంటీర్స్, తథితరులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 30.10.2026
www.mudranews.in | @mudranews

పామాయిల్‌ను మితంగా వాడండి

పామాయిల్‌లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే ఎల్‌డీఎల్ (చెడు) కొలెస్ట్రాల్ పెరిగే అవకాశం ఉంది. అందుకే రోజువారీ ఆహారంలో పామాయిల్ వినియోగాన్ని పరిమితంగా ఉంచడం మంచిది.

అంతర్రాష్ట్ర ముఠా సభ్యురాలి అరెస్ట్
25 తులాల ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

ముద్ర ప్రతినిధి, మెదక్: బస్సు ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రాఖీ పండుగ సందర్భంగా బస్సులో చోరీకి గురైన 30 తులాల బంగారు ఆభరణాల కేసును పోలీసులు సవాలుగా తీసుకుని ఛేదించి, ప్రధాన నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ. శ్రీనివాస్ రావు వివరాలు వెల్లడించారు. నల్గొండకు చెందిన సూరం స్నేహ ఆగస్టు 26న రాఖీ పండుగ సందర్భంగా తన 30 తులాల బంగారు ఆభరణాలను బ్యాగ్‌లో పెట్టుకుని నిజాంపేటలోని తన తల్లిగారి ఇంటికి బయలుదేరారు. నిజాంపేట చేరుకున్న తర్వాత బ్యాగ్‌లోని నగలు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించారు.అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ మార్గదర్శకంలో, తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో రామాయంపేట సీఐ బి. సైదా, నిజాంపేట ఎస్ఐ బి. రాజేష్‌లతో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సరూర్‌నగర్‌కు చెందిన మేకల సంధ్య (30)ను అదుపులోకి తీసుకున్నాయని ఎస్పీ తెలిపారు. విచారణలో నిందితురాలు తన తల్లి సతుపాటి రాధిక, బంధువు అక్షింతల సంధ్య, బండి మోజెస్, బండి దుర్గలతో కలిసి ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు వెల్లడైందన్నారు. చోరీ అనంతరం స్విఫ్ట్ కారు (టీఎస్ 08 ఈఎఫ్ 6174)లో హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడి నుంచి ఇన్నోవా క్రిస్టా (టీజీ 07 జి 1888)లో పరారైనట్లు పేర్కొన్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ముఠా సభ్యులు ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరస్పరం సంభాషించుకునేవారని, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమండ్రి, నిజామాబాద్, మెదక్ ప్రాంతాల్లోని బస్టాండ్లలోనూ చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని వివరించారు. నిందితురాలి నుంచి 4 బంగారు చైన్లు, 4 లాకెట్లు, 1 పుస్తెల త్రాడు, 13 ఉంగరాలు, 1 ప్లాటినం ఉంగరం, నల్లపూసల దండలు, కంకణాలు, గాజులు, కమ్మలు, చంపస్వరాలు, ముక్కెర, సిక పువ్వు తదితర సుమారు 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేసేందుకు, మిగిలిన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.బస్సులు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు ప్రజలు తమ విలువైన ఆభరణాలు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చోరీ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన రామాయంపేట సీఐ సైదా, ఎస్ఐలు రాజేష్, బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్ సునీత, కానిస్టేబుళ్లు రాకేశ్, భాస్కర్, నాగభూషణ్, సాజిద్, లక్ష్మణ్, రాజు, కృష్ణ, శ్రీనివాస్ నాయక్, ఐటీ కోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

రీ సర్వేపై ఎలాంటి అపోహలొద్దు

కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: రీ సర్వేపై గ్రామ ప్రజలకు ఎలాంటి అపోహలు వద్దని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. టేక్మాల్ మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.మీ గ్రామంలో నిర్వహించబోయే భూభారతి రీ సర్వే గురించి ఎలాంటి అపోహలు వద్దన్నారు. రీ సర్వే వల్ల గ్రామంలోని భూములకు పటిష్టంగా హద్దులు నిర్ణయించబడుతుందన్నారు. గ్రామంలో ఉన్న 718 ఎకరాల్లో సర్వే నిర్వహించి ఎలాంటి భూ సమస్యలు ఉన్న 60 రోజుల ముందు నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామని గ్రామస్తులకు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, అటవీ, అసైన్డ్, చెరువు, కుంట భూములు అనంతరం పట్టా భూములను సర్వే నిర్వహించి భూ తగాధాలు లేకుండా తీర్చిదిద్దుతామన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే మంచి కార్యక్రమం అని తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో గ్రామంలో ఉన్న భూమిని రీసర్వే నిర్వహించి రైతులకు అండగా ఉంటామన్నారు. సర్వే ఏడి కిషన్ మాట్లాడుతూ.. గ్రామంలో వారం రోజుల్లో ఈ సర్వేను ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలకాలన్నారు.ఆర్డీఓ రమాదేవి మాట్లాడుతూ.. రీ సర్వే గురించి ఎలాంటి సమస్యలున్నా అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ తులసీరామ్, సర్పంచ్, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య...టేక్మాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాన్ని, నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు అడిగి తెలుసుకున్నారు.వివిధ తరగతులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతో పాటు హెల్త్‌కేర్, రిటైల్ ఒకేషనల్ కోర్సుల తరగతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీస్తూ, అన్ని తరగతుల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ గుర్తింపు హాజరు తప్పని సరిగ స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతులు, ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించారు. ఫ్యాన్స్, ట్యూబ్‌లైట్లు తదితర విద్యుత్ పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, మరమ్మతులు అవసరమైన వాటిని వెంటనే బాగు చేయించాలని సూచించారు.విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు.

31న ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ అన్నారు. ఈ నెల 31న నిర్వహించనున్న ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం భువనగిరిలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమా వేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ, 1920 అక్టోబర్ 31న స్థాపించబడిన ఏఐటీయూసీ దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు రక్షణ కల్పించే చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, పల్లె శ్రీనివాస్, దుబ్బాక సంజీవ, కోశాధికారి సామల శోభన్ బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్లంకి మహేష్, పులమోని శంకర్, పాపగల్ల శంకరయ్య కనగళ్ల శ్రీను, పిన్నం జగన్, గౌరిగే శంకరయ్య, ముదిగొండ బసవయ్య, నరసింహ, కృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆసుపత్రులన్నీ ‘పీఎం రాహత్’లో నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 29 : రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడేందుకు ఉద్దేశించిన ‘పీఎం రాహత్’ పథకంలో జిల్లాలోని ఆరోగ్యశ్రీ జాబితాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 60 ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్డ్ ఆసుపత్రులు వచ్చే సోమవారం నాటికి పీఎం రాహత్ పథకంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులను సూచించారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో 10 కంప్యూటర్లతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రమాద బాధితులకు 7 రోజుల వరకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుందని, ప్రమాదం జరిగిన వెంటనే 112 అత్యవసర సంఖ్యకు సమాచారం అందించేలా సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రమాద ప్రాంతాలు, ఆసుపత్రులను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు 108 అంబులెన్సులకు ట్రాకింగ్ పరికరాలు అమర్చి బాధితులను వేగంగా సమీప ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారిపై అధిక వేగం వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పథకానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏసిపి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 29 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పిలుపునిచ్చారు. ఖమ్మం, వైరా పరిధిలోని ఉద్యోగులు, పట్టభద్రులను కలిసిన ఆయన, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6వ తేదీ చివరి గడువు ఉన్నందున, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. 20 వేల మంది ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. గతంలో ఉన్న ఓటర్లతో పాటు కొత్తగా అర్హత పొందిన పట్టభద్రులను పరిగణనలోకి తీసుకుంటే నియోజకవర్గంలో 50 వేలకుపైగా గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. కాబట్టి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులకు ఈ విషయంపై చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ లైబ్రరీ చైర్మన్ ఖమర్, మాజీ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఊట్కూరి రవికాంత్, వైరా నాయకులు కట్టా కృష్ణార్జున రావు, విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

కరెంటు షాట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : కరెంటు షాట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన భువనగిరి మండలం తుక్కాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్ జనగాం పాండు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొసని బిక్షపతి రేకుల ఇంటిలో కరెంటు షార్ట్ సర్క్యూట్ సంభవించగా మంటలు చెలరేగగా వెంటనే ఫైర్ స్టేషన్కు సమాచారం అందించగా వారు వచ్చి మంటలు అర్పిన్నట్లు చెప్పారు. అప్పటికే పూర్తిగా ఇంటిలో ఉన్న 46 ఇచ్చులా టీవీ, ఫ్రిజ్ కుటుంబ సభ్యుల బట్టలు, బంగారం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు విలువైన వస్తువులు పూర్తిగా రేకులు పగిలి మొత్తం ఆస్తి నష్టం 5 లక్షలు అయిందన్నారు. తక్షణమే ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆ కుటుంబంనికి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

బాలల పట్ల సున్నితంగా వ్యవహరించాలి

అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: సంరక్షణ, రక్షణ అవసరమైన బాలల పట్ల పోలీసులు సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సూచించారు. బాలల మానసిక స్థితిగతులను అర్థం చేసుకుని, వారికి భరోసా కల్పిస్తూ న్యాయం అందించాలని పేర్కొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్లాన్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లో జిల్లా షీ టీమ్స్, భరోసా కేంద్రం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, జువెనైల్ జస్టిస్, పోక్సో చట్టాల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. బాధిత బాలల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన రక్షణ, సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యధికారి డా. గణేశ్వర్, ఇన్స్పెక్టర్ రాజ శేఖర్ రెడ్డి, భరోసా, షీటీం పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగదారులు సహకరించాలి

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలో అన్నదాతలు, గృహ విద్యుత్తు వినియోగదారులు విద్యుత్తు పొదుపుగా వాడుకోవాలని మెదక్ జిల్లా ఎస్ఈ నారాయణ నాయక్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవడం ఎంతో శ్రేయస్కరమని ఈ విషయంలో తమ శాఖకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం గృహవిద్యుత్తుకు సంబంధించి వినియోగం ఎంతగానో పెరిగినప్పటికి డిమాండ్‌కు సరిపడా విద్యుత్తు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ నారాయణ నాయక్ పేర్కొన్నారు. ఈ సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల విద్యుత్తు వినియోగం తక్కువగా ఉంటుందని, దీనివల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని వివరించారు. ప్రస్తుతం విద్యుత్తు విషయంలో ఉన్న ఇబ్బందులతో పాటు ముమ్ముందు వచ్చే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అన్నదాతలు ఆరుతడి పంటలు వేసి విద్యుత్తు శాఖకు సహకరించాలని ఎస్ఈ నారాయణ నాయక్ అన్నదాతలకు విన్నవించారు. దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లాలో తమ శాఖ ఆధ్వర్యంలో సదస్సులను సైతం నిర్వహించి రైతులకు ముమ్ముందు విద్యుత్తుకు సంబంధించి ఏర్పడే పరిస్థితులను వివరించడం జరుగుతోందన్నారు.

రాష్ట్రస్థాయి రోల్ ప్లే పోటీలకు రాజ్ పల్లి విద్యార్థులు

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ లో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీలు నిర్వహించారు. రాజ్ పల్లి విద్యార్థులు ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రెండవ స్థానం హవేలీ ఘనపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మూడవ స్థానం కేజీబీవీ కొల్చారం విద్యార్థులు సాధించారు. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి రాజు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, న్యాయ నిర్ణేతలు రామేశ్వర ప్రసాద్, అంజాగౌడ్, స్టెలా, వంశీకృష్ణ పాల్గొన్నారు.

శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పాదుకా పూజ

ముద్ర ప్రతినిధి, మెదక్: శ్రీ సదానంద మఠాధిపతి, బసవ కళ్యాణ్, శ్రీ గురుమదనానందసరస్వతీ పీఠాధీశ్వరులుపరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ మాధవానందసరస్వతీస్వామి వారి పాదుకా పూజా మెదక్ పట్టణంలో గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి లలిత, కౌన్సిలర్ బట్టి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుండి శివాభిషేకం అనంతరం స్వామి పాదుకపూజ జరిపారు. మెదక్ పట్టణ బ్రాహ్మణోత్తములు, స్వామి వారి శిష్యులు తదితరులు పాల్గొన్నారు. భజన పాటలు ఆలపించారు. స్వామి మాట్లాడుతూ...భగవంతుడు నిర్దిష్టమైన పేరు, రూపానికి పరిమితం కాదని, ప్రతి ఒక్కరిలోనూ దైవత్వాన్ని గుర్తించాలని సూచించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మనకు సహాయపడే వ్యక్తులను గౌరవించాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని అన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కర్తవ్యాన్ని విస్మరించకూడదని, చేయాల్సిన పనిని నిష్ఠతో నిర్వహించాలని హితవు పలికారు. కోట్ల రూపాయలు వెచ్చించి అన్నదానం చేసినా, ముందుగా కన్నవారైన తల్లిదండ్రులకు అన్నం పెట్టి, వారి బాగోగులు చూసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరినీ ప్రేమతో చూడాలని, సేవాభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. బట్టి జగపతి లలిత నిష్ఠతో, పవిత్రమైన జీవన విధానాన్ని అలవర్చుకుని పాదుకా పూజ నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ దంపతులను ఆశీర్వదించారు. ఈ పూజలో మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జి కంటారెడ్డి తిరుపతి రెడ్డి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మామిళ్ళ ఆంజనేయులు, శ్యాంరావు, గంగా వెంకటేశం, చింతల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ లో క్యాండిల్ ర్యాలీ

ముద్ర ప్రతినిధి, మెదక్: పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా మెదక్ పట్టణంలో పోలీస్ అమరవీరుల స్మారకార్థం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోస్ట్ ఆఫీస్, అంబేద్కర్ చౌరస్తా, రామాలయం మీదుగా రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా దేశం కోసం, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగనాథ్, సీఐలు మహేష్, జార్జ్, కృష్ణమూర్తి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ జట్టును అభినందించిన ఎస్పీ

ముద్ర ప్రతినిధి, మెదక్: కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటర్ జోనల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. జట్టు విజయాల్లో సాయి కుమార్ కీలక పాత్ర పోషించాడు. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 126, 84, 86 పరుగులు సాధించి అసాధారణ బ్యాటింగ్ ప్రతిభ కనబరిచాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ భారీ స్కోర్లు సాధించి జట్టును విజయతీరాలకు చేర్చడంలో కీలకంగా నిలిచాడు.సాయి కుమార్ వ్యక్తిగత ప్రతిభతో పాటు జట్టు సభ్యుల సమష్టి కృషి, పట్టుదల, క్రీడాస్ఫూర్తి ఈ విజయానికి దోహదపడ్డాయి. విధి నిర్వహణలోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ మెదక్ జిల్లా పోలీస్ శాఖకు జట్టు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జట్టు సభ్యులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన ఆటగాళ్లను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555